అభినవసరస్వతి.

సంపుటము 30	శ్రీబహుధాన్య సంవత్సరము ఆశ్వయుజమాసము	సంచిక ౭

కృతివిమర్శము

పిండాండరామాయణము — ఇత్యాది వ్యాకరణ వేదాంతశాస్త్రాధ్యేతలును శతావధానులును నగు వేమూరి నృసింహశాస్త్రులుగారిచే రచితము. సాంధ్రతాత్పర్యము. వెల 0-2-0. పరిదృశ్యమాన పర్వత నద్యాత్మక ప్రపంచము బ్రహ్మాండము. మనశ్శాంతి భక్త్యాదివిశిష్ట శరీరము పిండాండము. ఈపిండాండ బ్రహ్మాండముల రెంటికిని సామ్యమును వర్ణించి సమష్టివ్యష్టిభేదముమాత్రమే వీని కున్న ట్లీరామాయణమునఁ జెప్పఁబడినది. బ్రహ్మాండమున కన్వయించు రామాయణమునందలి సమస్త పాత్రలకుఁ బిండాండమునందలి ధర్మములు సమానముగఁ జెప్పి శాస్త్రులుగా రీగ్రంథమునకుఁ బిండాండరామాయణమని పేరిడిరి. అందు శరీరనాథ బ్రహ్మవేత్తృత్వ తమస్స్వరూపావరణాదులకు దశరథ విశ్వామిత్ర తాటకాదినామములు గుదిర్చి బ్రహ్మాండరామాయణముతోపాటు పిండాండరామాయణము ప్రదర్శింపఁబడినది. మచ్చునకిందలి కొన్ని పద్యము లుదాహ్రియమాణములు. ఆంధ్రతాత్పర్య మున్నను విస్తరభీతిని మూలమే ప్రకటీక్రియమాణముగనుకఁ జదువరులే సమన్వయము చేసి కొందురుగాక.

శ్లో. అత్రాంతరే సమారేభే బ్రహ్మవేత్తృత్వకౌశికః
సత్కర్మనామకమఖం లోకానుగ్రహకామ్యయా. 9
తమస్స్వరూపావరణాఖ్యా తాటకా ఽశ్రద్ధా దురాచారసమా
హ్వయౌ సుతౌ। తస్యాస్తు మారీచ సుబాహురాక్షసౌ, వేత్తై
ర్మఖ స్తస్య వినాశితోఽభవత్॥ తతో యయాచే స మునిర్మనో
రథం శరీరనాథం తనయద్వయార్పణమ్। బ్రహ్మజ్ఞవర్యత్వవసిష్ఠ
బోధిత స్స ప్రాహిణో త్తేన సుతద్వయం నృపః॥

శ్లో. రామం తచ్చోదిత శ్చిత్తరావణో మోహయన్ ప్రియామ్
అశ్రద్ధాభిధ మారీచ మాయయాపాహరత్ఖలః
తదాశ్రద్ధాఖ్యమారీచో హతోఽభూ ద్రామతాడితః
శాంతిసీతావిరహిత ఏవం రామోనుచింతయన్

భక్తిం జటాయుషం శ్రద్ధాం శబరీ మాత్మచింతకాన్
కబంధం ధ్యాననామానం స్వస్వరూపైక్య మానయన్
తేభ్యో భవిష్యద్వృత్తాంతం జ్ఞాత్వాఽగచ్ఛ దితస్తతః
మనోహనుమతా బుద్ధిసుగ్రీవస్య సఖాకృతః
రజోహంకారనామానం రామో హత్వాచ వాలినమ్
బుద్ధివృత్తి కపీనాంతు సుగ్రీవ మకరో త్ప్రభుమ్.

— కొడుకులూ - కూఁతుళ్లూ. —

(శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులుగారు.)

కొడుకులు ముక్తికారకులని ఆర్యులగ్రంథాలన్నీ యేకవాక్యతగా ఘోషిస్తూ వున్నాయి, దశరథుఁడు మొదలైనవారు పుత్రులకోసం పడ్డపాట్లు హేయంగా కనపడవుగాని పాఁడురాజువగయిరాలు పడ్డపాట్లు కొంత శాస్త్రీయములే అయినా అపహాస్యాస్పదంగా కనపడతాయి. యేమైనాసరే! మనభారతీయులు ఐహికం కన్నాకూడా పారమార్థికానికి పుత్రులు యెక్కువగా తోడ్పడతారనే నమ్మకం పూర్తిగా కలిగి యున్నారు. "ఏష్టవ్యా బహవః పుత్రా యద్యేకోఽపి గయాం వ్రజేత్" అనేవాక్యంవల్ల చాలామంది కొడుకులుండడానికి మనభారతీయులు అభిలషించేవారని తేలుతూ వుంది. అలా అభిలషించడానికి ముఖ్యకారణం గయ కేగి అక్కడ పితృదేవతలకు వుత్తమగతిని కల్పించేకార్యం చేస్తారనేదే కాని ఐహికప్రయోజనం మాత్రమే కాదు. ఐహికప్రయోజనాలుకూడా కొన్ని చూపివున్నారు.

ఆ. వె. "కొడుకు గల్గెనేని కొడుకునకును బెండ్లి
చేసి కాపురమ్ము చేయుచున్న
ముగుదయైన యట్టి ముద్దులకోడలి
మొగము గనుటకన్న ముదము కలదె!"

పైపద్యంలో వున్న సంతోషం పామరమాత్రులకు సంబంధించిందికదా ? పండితులుకూడా దీన్ని అభిలషించక పోరుగాని వారికి పామరుల కున్నంత కోరిక వుండదేమో. పామరానందంలో,

చ. "కొడుకులు లేనివాఁడు తనకున్ మృతికాలము సంభవించిన
వ్వుడు తనద్రవ్యమున్ గృహము భూమియు నేమయిపోవునో యెవ్వఁ డపహరించునో? యనెడిభ్రాంతి వహించి తనంతఁ దాన పెక్కుడుమలఁ జెందుఁగాన కొడు కేర్పడి యుండుట ముఖ్య మేరికిన్

యీపద్యంలో వుండే అంశాలు కొట్టేయతగ్గవి కావు. సంతు లేనివాఁడు ధనికుఁడై వుంటే వాఁడు మరణించవలసి వస్తే వాణ్ణి సుఖసుఖాల చావ నివ్వరని వేరే చెప్ప నక్కఱ లేదు. రిక్తులకుమాత్రం యీచిక్కుండదు. అందులోనూ పూర్వకాలంకన్నా కూడా యీకాలంలో సంతానహీనులైన ధనికులు చావ వలసివస్తే కోర్టులకూ ప్లీడర్లకూ కావలసినంత పని కల్పన చేశారన్నమాటే. సరే! యివన్నీ అంటే యీమన స్మృతిసీన్నీ మనలో విజ్ఞులకు ప్రధానఫలితం కాదు.

సీ. "వార్ధకావస్థ సంప్రాప్తించుచోఁ గడు
 శ్రద్ధాళుఁడై పరిచర్య సేయు
ధనము సంపాదించి తగువస్తువులు తెచ్చి
 తన కిచ్చి మిగుల సంతస మొనర్చు
మృతి చెందినను బరగతికి సాధనమైన
 ప్రేతకార్య మొనర్చి ప్రీతి నించు
గయకు నేగి పితృసద్గతికినై విష్ణుపా
 దంబుపైఁ బిండదానం బొనర్చు

తే. గీ. సుతులఁ గనకున్నఁ బరలోకగతులు సున్న
పుత్రగాత్రపరిష్వంగమున జనించు
సుఖముకన్నను వేఱొండుసుఖము లేదు
గాన తగునట్టిపుత్రులఁ గాంచ వలదె?"

యీపద్యంలో, 1 - 2 చరణాల్లో వుండే అర్థం యిహానికి సంబంధించిందే. అయినా అర్థాన్ని సార్థకపఱుస్తూ వర్తించేకొడుకులు పూర్వం విస్తరించి వుండేవాళ్లేమో కాని యిప్పుడు మిక్కిలి తక్కువగా వుంటారు. ప్రపంచం మారిపోయింది. వృద్ధులైన తల్లిదండ్రులను అవసాన కాలమందు కనిపెట్టుకొనివుండడానికి యెన్నో విఘ్నాలు కనపడతాయి. యితరవిఘ్నాలమాట అలావుండఁగా యేసినిమాకో వెళ్ళడం పట్నవాసంవాళ్ళకే కాకుండా అకట్నానికి సమీపంలో వుండే పల్లెటూళ్లవాళ్లకుకూడా నల్లమందు అలవాటులాగ యేర్పడింది, యిది వక్కటేకాదు యింకా యెన్నో అవాంతరవిషయాలు కనపడతాయి వక్కటి చూచుకోండి. గాంధీమహాత్ముఁడు పూర్వాచారాలలో వేటిని తోసిరాజన్నా మాతాపితృసేవను అందులో అవసానకాలంలో చేసేపరిచర్యను "తోసిరా" జనేవాఁడు కాఁడుగదా. ఆయన చరిత్ర చదివి చూడండి. ఆవిషయంలో ఆయన కృతకృత్యుఁడు గాకపోయి యిటీవల పొందిన పరితాపం యెంత దుఃఖకరంగా వుంటుందోను, భవిష్యత్కాలంలో యింతటిలోకోత్తరుఁడు కాఁబోయే మహాపురుషునికే ఆఫలితం దక్కనప్పుడు యితరులమాట చెప్ప నక్కఱ లేదు. ఆకారణంచేత తుట్టతుదిని జరగఁ దగ్గపరిచర

కోసం పుత్రులను అభిలషించడం కార్యకారి కాదు పుత్రులు వుండి చేయకా పోవచ్చును, అన్యులు చేయా వచ్చును. అదిన్నీ కాక కాస్తసేపటికో కూస్తసేపటికో యావత్తూ తేలేసందర్భానికి ఆయీపరిచర్యవల్ల జరిగే వుపకారం యేమిటి? ఆపరిచర్యకూడా పొందేవానికన్న చేసేవాళ్లకే భావిపుణ్యానికి హేతువు. రెండో చరణంలో వున్నపరిచర్య అక్కడక్కడ యీకాలంలోకూడా కనపడేదే కాని ధర్మవ్యాధుడులాగ ఆచరించేవాళ్లు అరుదు. గ్రంథాలలో మరింత వృద్ధిచేసి వర్ణించడమూ వుంటుంది. కానివ్వండి తగినంత ప్రయోజకత్వం వున్నకొడుకులను కన్నతల్లిదండ్రులకు రెండోపాదంలో వున్న పరిచర్యాభాగ్యం యీకాలంలోకూడా సంఘటిస్తూనే వుంటుంది. యిప్పటి సంస్కర్తలు దానికి అడ్డుతగలడం లేదు. కాని యీమధ్య కాంగ్రెస్సులో చేరి కారాగారాలకు వెళ్ళినవారిలో పలువురకు సంబంధించిన తల్లిదండ్రులు ఆయీభాగ్యం లేకుండానే స్వర్గతులు కావలసి వచ్చింది - కాని అది వారిబుద్ధిపూర్వకంకాదు గనక ఆపుత్రులను యేమీ అనవలసి వుండదు. (అయితే అందులో యెందఱో అనంతరకర్మకు అంగీకరించని బాపతు అయినాసరే) మొత్తం యీకాలంలో యేసత్కార్యం చేద్దామన్నా విఘ్నాలు మిక్కిలిగా వున్నాయన్నందుకు పైసందర్భంకూడా వుదాహరణంగా పుచ్చుకోవచ్చును. యింక మూఁడు నాలుగుచరణాలల్లో వున్న అర్థాన్నిగూర్చి మాట్లాడుకుందాం. అది సర్వమున్నూ పరలోకానికి సంబంధించిందే. అందులో గయావర్జితం యిప్పటివా రేకొందఱో నిర్వహిస్తూ వున్నారు కాని ఆకృత్యాన్ని యేభోక్తలకు చేస్తారో వారివల్ల పితృదేవతలు తృప్తిపడతారా ? అనే సందేహం ప్రతీవిజ్ఞులకూ కలుగుతుంది. పెద్దపెద్దమహారాజులేమి కోటీశ్వరులేమి ఆభోక్తలకే వారివారి ఐశ్వర్యానుసారంగా దక్షిణ లిచ్చి ఆరాధించడంచేత వారు రాజాధిరాజులవలె ఐశ్వర్యవంతులై వున్నారు. వారు భోక్తలకు చెప్పఁబడ్డలక్షణాలల్లో యేవీ కలిగి వుండరు. కాని ఆక్షేత్రమందు వున్నమహిమనుబట్టికాని మనపూర్వులు ఆకార్యమును చేయడం వారినిబట్టికాదు కనక దాన్ని పూర్వపక్షం చేయడానికి అధికారం ఆస్తికుల కెవ్వరికీ వుండదు. నాస్తికులకు యేదీ అడ్డదు కనక వారు ప్రతిదాన్ని పూర్వపక్షం చేస్తారు. అక్కడే కాదు యెక్కడాకూడా యీకాలంలో యుక్తమైన భోక్తలు తటస్థపడరు. కాఁబట్టి దానికోసం పుత్రులను అభిలషించడంకూడా యిప్పుడు జాస్తిగానే కనపడుతుంది. కన్నపుత్రులవల్లనే పూర్వులు అభిలషించేఫలితాలు కనపడకుండా వుండే యీకాలంలో కొందఱు దత్తపుత్రులనుకూడా తెచ్చిపెట్టుకొని తద్ద్వారా యెన్నోచిక్కులకు లోనగుచున్నారు. దీన్నిగురించి పాణిగృహీతలో

చ. పితరులసద్గతింగుఱిచి పెంచికొనందగు నెవ్వరేని నేఁ
టి తులువబాలకుల్ సలువురీవుల కేడుతరమ్ము లిట్టటుల్
గతిచెడి ఘోరమైన నరకమ్మునఁ గూలుట నిక్కువమ్ము సం
తతికి ఫలమ్ము వోవుతఱి దాపరమయ్యె నిఁకేటి దత్తతల్?"

అని ఒకపద్యం వ్రాసినట్లు జ్ఞాపకం. యీపద్యం వ్రాసేనాటికి యింకా కాలం యింతవింతగా మార్పు చెందినట్టులేదు. అప్పటి కింకా కొందఱికి శాకపోతే మఱికొందఱికేనా యితరకర్మలమాటేలా వున్నా అబ్దికాలేనా నడుస్తూ వున్నాయి. యిటీవల అవికూడా లోపించినట్టున్నా లోపించక యెక్కడేనా జరుగుతూ వున్నా జరగనివాట్లలోనే జమకట్ట తగ్గట్టున్నా పరిణమించాయి. పూర్వు లభిలషించిన మహాభాగ్యమేనా పుత్రులవల్ల ఒక్క పుంనామనరకం లేకుండా పోవడంమాత్రమే. యితరనరకాలు లేకుండా ప్రవర్తించినప్పటికీ యీనరకం పుత్రులవల్లఁగాని అన్యథాగా తరింప శక్యంకాదని కర్మనిష్ఠాపరులతాత్పర్యం జ్ఞానులో సమస్తమున్నా జ్ఞానంద్వారాగానే తరింప వచ్చునని అభిప్రాయపడి వున్నారు. దాన్ని పురస్కరించుకొనియ్యేవే.

మ. కొడుకుల్ గల్గరటంచు నేడ్తు రవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకుల్ గల్గరె ? కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసెన్? బుత్రులు లేని యాశుకునకుం బాటిల్లెనే దుర్గతుల్?
చెడునే, మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!"

అని ధూర్జటికవి వ్రాసి యున్నాఁడు. యీపద్యాన్నిబట్టి ధూర్జటి అపుత్రకుఁడేమో అని తోస్తుంది. ఆకారణంచేతనే యీవిధంగా సరిపెట్టుకున్నట్టున్నూ తోస్తుంది. సంతానం కలగనికొఱుల్లో నేనుకూడా యీవిధంగానే కామేశ్వరిలో వ్రాసి వున్నాను.

శా. సంతానమ్మున ముక్తి చేకుఱుటయే సత్యంబయేనిన్ జడ
స్వాంతమ్ముల్ పసుపక్షికీటములు మోక్షం బందుటే నిక్క మి
క్కాంతుల్ కాంతలు గొడ్డువాండ్రగుటయున్ గల్గున్, దటస్థింప వీ
చింతల్ వానికి నంట సిద్ధమకదా? శ్రీదేవి? కామేశ్వరీ!"

"ఉద్ధరే దాత్మనాఽఽత్మానమ్" అని వుండడంచేత తన్ను వుద్ధరించుకో వలసి వస్తే తానే వుద్ధరించుకోవాలిగాని కొడుకులుగాని యితరులుగాని అందుకు వుపకరింపరనేదే పరమసిద్ధాన్తం; కాని కొన్ని సందర్భాలలో ఆత్మచేత ఆత్మోద్ధరణానికి అవకాశం లేక పోవడమున్నూ తటస్థిస్తుంది కనక అట్టివిషయాలలో–"ఆత్మా వై పుత్రనామాఽసి" అని వుండడంచేత పుత్రులద్వారా తరణోపాయాన్ని పూర్వమహర్షులు యేకవాక్యతగా అంగీకరించి వున్నారు. సగరపుత్రులు యీరీతినే తరించినట్టు స్పష్టమే. అయితే యిక్కడ ఒకశంక కవకాశం కనపడుతుంది. సగరపుత్రులు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమైన కపిలమహాముని నేత్రాగ్ని చేతకదా భస్మమైనారు. వారికి తద్ద్వారాగానే మోక్షం రావలసి వున్నప్పుడు మళ్ళా వేఱొక ప్రయత్నం యెందుకు ? అనేశంకకు సమాధానం కనపడదు. సగరపుత్రులకు వైవిధంగా మోక్షం లభించనిపక్షంలో రావణాదులకుకూడా మోక్షోపాయం

అన్యథా గా వెదకవలసే వస్తుంది. అయితే యీలాటి శంకలు చేయడం యుక్తం కాదు. గంగావతరణార్థం ఆయితిహాసం పుట్టింది. అక్కడ యెంతసేపూ దానికే ప్రాధాన్యం యివ్వాలి, కాఁబట్టి యీలాటివి కుశంక లనిపించుకుంటాయి. చేస్తే ప్రతిచోటా యీలాటిశంకల కవకాశం కలుగుతుంది. శ్రీమహావిష్ణువు సందర్శనం అయినంతలో ముక్తి కలగడం సిద్ధంకదా ? అలా కలిగిన రాక్షసులకందఱికీ కలిగిందని చెప్పఁగలమా ? యెవరేనా కలిగిందంటే లేదని నిరూపించఁగలమా? క్రియమాట మనకు ప్రస్తుతం కావలసింది మనమహర్షులు పుత్రులవల్లకూడా తరణోపాయాన్ని అభిలషించారన్నదియ్యేవే. యీలా తరించడంకూడా ఉద్ధరే దాత్మనాఽఽత్మానంకిందకె వస్తుంది. కేవలమూ కామ్యంగా యేర్పడ్డ సంసారాన్ని మనపూర్వులు కర్మవిశేషాలతో చేర్చి తరణోపాయంగా సమర్థించినట్టు తోస్తుంది. అయితే వారిసమర్థనం స్వకపోలకల్పితంమాత్రం కాదు. పూర్వవేదం వారికి సర్వథా తోడ్పడింది వకపుత్రుఁడేకాదు భార్యకూడా తరణోపాయానికే సాధన మయింది. యిది విషయాంతరం. మొత్తం పుత్రులవల్ల యిహపరలోకాలు రెండూ జయించ వచ్చునన్నదే మనపూర్వులతాత్పర్యం యీబాదరబందీ అంతా యెందుకు! జ్ఞానంచేత సంపాదించుకోరాదా! అనేమాటమాత్రం తేలికగా కనపడుతుంది గాని అజ్ఞానం పైపైని వుందా! యెక్కడో కోటికొక్కఁడుకూడా అలాటిజ్ఞాని వుండడం దుర్ఘటం, లోకమంతా స్త్రీపురుషమయం. వీరికి పరస్పరసంబంధం అనివార్యం. యీసంబంధం జంగమాలకేకాదు; స్థావరాలకుకూడా వుందని శాస్త్రవేత్తలు కనిపెట్టి వున్నారు. అట్టి అనివార్యవిషయాన్ని పరమపవిత్రమైనదాన్నిగానూ తరణోపాయంగానూ సమర్థించిన మనపూర్వమహర్షులను యెంత స్తుతించినా తనివి తీరదుగాని నేఁటికి వారు యేర్పఱిచిన ధర్మసేతువు విచ్ఛిన్నం కావలసి వచ్చిందికదా అని విచారించడం తటస్థించింది. వారిధర్మాలకే భంగం కలిగేటప్పుడు పుత్రులవల్లవారు ఆసించినఫలితాలుమాత్రం యెందుకు నిలుస్తాయి? అందుకే వారు ఆపుత్రులు పిత్రాజ్ఞాపరిపాలకులుగా వుండాలని కూడా కొన్ని యితిహాసాలు వ్రాసి చూపి వున్నారు. రాముఁడు పిత్రాజ్ఞాపరిపాలనద్వారాగానే భగవంతుఁడుకూడా అయినాడంటే వొప్పనివారు టూరా ! కౌసల్యతో వనవాసాన్ని గూర్చి శ్రీరాముడు మాట్లాడడంలో పూర్వాచారానికి యెంతప్రాధాన్యం యిచ్చిందీ స్పష్టపడుతుంది. కావలసినవారు రామాయణంలోనే చూచుకుంటారని స్పృశించి మాత్రం విడిచాను. యెప్పుడు పూర్వాచారాలు వదులుకున్నామో అప్పుడే పుత్రులవల్ల వచ్చేప్రయోజనాలున్నూ అంతరించవలసి వచ్చిందన్నది పరమార్థం. యిప్పుడల్లా సంతానంవల్ల కనపడే ప్రయోజనం పసితనంలో వుండే ముద్దుముచ్చటలుమాత్రమే. తరవాతనో వాఁటితోవ వారిదీ వీఁటితోవ వీరిదిగా కనపడుతుంది. అలా వున్నప్పుడు తల్లిదండ్రులు వుపేక్షిస్తే కొంత అందంగా వుంటుంది. కలగజేసుకుంటేనో ! బోలెడురసాభాసకు మూలం కావడమేగాని తుదకు కలిగే ప్రయోజనం శుద్ధశూన్యం, ఆయీకాలవిశేషాన్ని పురస్కరించుకొని పుట్టినది

కాకపోయినా ప్రస్తుతకాలానికి అనువర్తిస్తూవున్న వొకయుక్తివిశేషాన్ని శ్రీగురువుల వారు చెప్పినదాన్ని వుదాహరిస్తూన్నాను.

తే. గీ. ఎంచి వలసిన విత్త మార్జించికొనుము
సుతునికన్నను విత్తంబు సుఖకరంబు
మున్నజీగర్తుఁ డనుముని కన్నసుతుని
యజ్ఞపశువుగ నమ్మివేయఁడె మహాత్మ!

స్థూలదృష్టిని చూస్తే యీయుక్తి యుక్తంగా వున్నట్లే కనపడుతుంది. ఖండాంతరాలన్నీ దీనిమీదే ఆధారపడి వున్నట్లు తోస్తుంది. సూక్ష్మదృష్టిని విచారిస్తేమాత్రం పుత్రవంతుఁడు కాని వానికి తుదిఅవస్థలో ద్రవ్యంవల్ల జరిగే వుపకారంకూడా శూన్యమే, బాధ్యతతో కూడుకున్న కొడుకు లుంటేనే తా నార్జించిన ద్రవ్యాన్ని యేలా వినియోగించి ఉపకరించాలో అలా వినియోగించి వుపచారాదులు జరిగిస్తారు. కాని యితరులు జరిగిస్తారనేది సంశయాస్పదం. ద్రవ్యంకన్న పాపిష్ఠి లేదు అది యెవరికోనా సరే అపహరించేవారు సంశయింపరు. దండనభీతితప్ప అవిషయంలో యితరభీతి బాధించదు. దేవద్రవ్యాపహరంవగయిరాలన్నీ యీసూత్రాన్ని పట్టే వుఁటాయి. మాపరమగురువులు చెప్పిన వకయితిహాసాన్ని వుదాహరిస్తాను. కాశీలో దిగంబరస్వాములవారని వకఅవధూత సుమారు అయిదువందలయేళ్ళవయస్సు కలవారు వుండేవారట. ఆయన వఱద వచ్చినప్పుడు గంగవొడ్డు మునిగితే దానితో పాటు మునిగిపోవడమే అనిన్నీ తరవాత గంగ తీసినప్పుడు వండ్రుపట్టితో పూడుకుపోతే ఆమట్టి తవ్వించి ఆయన్ని బయటికి శ్రీకాశీమహారాజులుంగారు తీయించేవారనిన్నీ గురువుగారు చెప్పగా నేవిన్నాను. దీన్నిబట్టి యీయన చ్యవనవాల్మీక్యాదులవంటివాడని తోస్తుంది. ఆయన పంచాగ్నిమధ్యంలో కూర్చుండి తపస్సు చేసుకుంటూవుంటే వొకప్పుడు పృష్ఠభాగం అంటుకొని కాలడం ఆరంభించినట్టున్నూ అది ఆయన గణించినట్టే లేదనిన్నీ యితరులే దాన్ని ఆర్పినారనిన్నీ శ్రీవారే చెప్పగా విన్నాను. యీకలియుగంలో అట్టితపస్వులు అట్టి దీర్ఘజీవనులు వున్నారా అనే శంక పలువురికి కలుగుతుంది. కాని యీమధ్య శ్రీమదనమోహనమాళవ్యాగారికి కాయచికిత్స చేసిన మహామహుని చరిత్రను వినడంవల్ల మనలో యెట్టి మహానుభావులేనా పూర్వం వుండేవారనేమాటను విశ్వసించనివారు వుండరు. ప్రస్తుత మేమిటంటే! యెవరో కోటీశ్వరుడికి యేదో ఆపత్తు వచ్చి యీస్వామికి మ్రొక్కుకోవడం తటస్థించింది. ఆమొక్కుబడిసొమ్ము సుమారు మూడులక్షల దాకా వుందట! ఆసొమ్ము తెచ్చి ఆస్వామిముందర పోగు పోశాడు ఆభక్తుడు. గుళ్ళో రాతివిగ్రహమేనా మాట్లాడుతుందేమో కాని ఆయన యెన్నడూ యెవరితోటీ మాట్లాడినట్లు లేదు. సరే! గుళ్లో చెల్లించినట్టే చెల్లించి ఆత్మప్రదక్షిణనమస్కారాదులు నిర్వర్తించి అభక్తుడు వెళ్లిపోయాడు. తరవాత యెప్పుడూ యెవరితోటీ అధరస్పందం చేయని ఆమహాపురుషుడు పరిసరవర్తులుగా వుండేవారిని పిల్చి "నేను

యీరోజుమొదలు వర్తకం మొదలు పెడుతూ వున్నాను. పాలుగాని పెరుగుగాని మీగడగాని వెన్నగాని అమ్మకోనేవాళ్ళు నాకే అమ్మవలసింది; కొనుక్కునే వాళ్ళు నాదగ్గరే కొనవలసింది" అని చెప్పేటప్పటికి ఆయాపదార్థాలు తెచ్చి అక్కడ పెట్టి వాట్లవాట్లకు సరిపడ్డ వెలను తీసుకుపోతూ వుండేవాళ్ళు తీసుకు పోతూ వుంటే మళ్ళా ఆపదార్థాలు కావలసినవాళ్ళు కొనుక్కొని దానికి తగ్గ వెల యిచ్చి పోతూ వుండేవాళ్ళనిన్నీ స్వామి చూస్తూనో చూడకుండానో వుండే వారనిన్నీ నాలుగైదేళ్ళల్లో అలక్షలకొలదిగా పోగోసినధన మంతా "సున్నకు సున్నా హళ్ళికి హళ్లీ"గా పయిసలయి హరించి పోయిందనిన్నీ చెప్పగా విన్నాను. స్వామివుద్దేశ మేమిటంటే ? యీధనం రావడంకూడా వకప్రారబ్ధంలోదే కనక యీప్రారబ్ధం యీవిధంగా అనుభూతం అయినట్లు తలచి సంతోషించినట్లు తోస్తుంది. "ప్రారబ్ధం భోగతో నశ్యేత్, ప్రారబ్ధకర్మణాం భోగాదేవ క్షయః" అనేవాక్యాలు సర్వవేదాంతసమ్మతాలు. అయితే ఆపదార్థాలు స్వామికి తెచ్చి విక్రయించేవాళ్ళల్లోగాని ఆపదార్థాలు కొనుక్కునేవాళ్ళల్లోగాని అందఱూ న్యాయమైన ప్రవర్తన కలవాళ్ళే వుండేయెడలగాని యితరబాపతు తస్కరులంటూ అధనానికి ఆలాయపడక పోతేగాని అధనం ఆరోజుకు ఆరోజు అంతో యింతో వృద్ధి కావలసిందేగాని పూర్తిగా నాశనం యెన్నటికీ కావలసి వుండదు. అందుచేత మన మేమనుకోవాలి? అద్రవ్యాన్ని వాళ్ళూ వాళ్ళూ ఆత్మవంచకులై "గుటకాయ స్వాహా" చేశారనుకోక తప్పదు. దేవద్రవ్యంగాని యతిద్రవ్యం గాని ముట్టకూడదంటూ యెన్నడో యెన్నో ధర్మవాక్యాలు పుట్టి వున్నాయిగాని ఆవాక్యాలు అమల్లోకి తెచ్చిన ప్రజలు వున్నారో లేదో! చెప్పజాలం. బ్రాహ్మణ ద్రవ్యంకూడా అలాటిదే అని ధర్మశాస్త్రాలల్లో కనపడుతుందిగాని దాన్ని యీకాలపువారు స్వార్థపరత్వంచేత బ్రాహ్మణులు వ్రాసుకున్నమాటగాతోసేస్తారు. ప్రస్తుతం పరీక్షాకాలం వచ్చింది. ఋణనివారకచట్టం అమల్లోకి వస్తూ వుంది కనక అమాయికులైన పూర్వపురకం బ్రాహ్మలబాపతు ఋణాలుకూడా కొన్ని దీనికి గురికాక తప్పదు. అపహరించడంలో బిల్లులో వుద్దేశించినహేతువులు లేకుండా కూడా పదుగురితోపాటు అబిల్లుకిందకి వచ్చి అపహరించే వ్యక్తులుకూడా కొందఱు వుండకపోరు. అవ్యక్తులఋణాలు భూములు కొన్నవీ అల్లుళ్లకట్నాలవి, యింకా యీలాటివే కాని వ్యవసాయకపు బాపతులోవి కావు. కాని వారు న్యాయబుద్ధితో అయ్యో! మనఋణం దీనికింద కెందుకురావాలి అని ఆలోచిస్తారా! బిల్లుమాత్రం తీర్చేవాళ్లని వద్దని నిషేధించడం లేదు. అందుచేత అభినంద్యమే. నిజంగా భగవంతుడే వుంటే అట్టివారి భావికాలస్థితిచేత లోకానికి "విప్రస్వం విష ముచ్యతే" అనే వాక్యంలో వుండేసత్తాని తెలపవలసి వుంటుంది. కాని యీకాలంలో అట్టిదృష్టాంతాలకు అవకాశం వుంటుందా! భవతు. అట్టివిప్రులంటూ వుంటే అట్టిదృష్టాంతాలున్నూ వుంటా యనుకుంటాం. వారు లేరు కనక యివీ లేవు. యిది విషయాంతరం. వొకయొస్టేటు బ్రాహ్మడిదే యెవరో వంచించి అపహరించారనిన్ని అబ్రాహ్మడు

యెన్నివిధాల అడిగినా తుదకు యివ్వనే లేదనిన్నీ పిమ్మట ఆయన (వేదవేత్త) తన్మూలకంగా ఆత్మహత్య చేసుకొని బ్రహ్మరాక్షసుడై బాధించి వేదం చదువుకొన్నవారిని పూజించడంద్వారాగా అసామ్ములో కొంత ఖర్చు పెట్టించడం ఆదేశించాడనిన్నీ యీదేశంలో పలువురెఱిగిందే. యింకో పెద్దసంస్థానంలో జరిగే పెద్దధర్మానికూడా యీలాటికారణమే సుప్రసిద్ధంగా వుంది. అది విప్రద్రవ్యాపహారప్రయుక్తంకాదు. విప్రప్రాణాపహారప్రయుక్తం. ఆప్రాణాపహారం చేసిన పురుషుడు భోజనానికి కూర్చుంటే అన్నమంతా పురుగులవలె కనపడేదనిన్నీ తరవాత ఆద్రవ్యం చాలాభాగం బ్రాహ్మణులకు వేదవేదాంగాదివిద్యాప్రవిష్టులకు వినియోగించడంద్వారా ఆదోషం కొంత నివర్తించిందనిన్నీ చెప్పుకుంటారు. యిప్పటికిన్నీ ఆధర్మం అవిచ్ఛిన్నంగా జరుగుతూనే వుంది. సంతానమే ఆపురుషునివంశంలో వుండదనికూడా మొట్టమొదట ఆబ్రాహ్మణుడు శపించినట్లు వినికి. ఆశాపం ఏడోతరంలోనో యెనిమిదోతరంలోనో ఫోర్సు తగ్గి అంతరించి స్త్రీ సంతానం కలిగి తద్వారాగా పుత్రసంతుకూడా కలిగిందని వింటున్నాము. కాని యీసందర్భాలన్నీ ఆయావ్యక్తుల మనోదౌర్బల్యప్రయుక్తాలుకాని యధార్థాలు కావని తోసేస్తే పోయేవే కాని నిల్చేవి కావు. అథవా నిలుస్తాయే అనుకుందాం ప్రత్యక్షంగా వున్న రాజకీయశిక్షకే లక్ష్యపెట్టక దుష్కార్యాలు చేసేవాళ్ళు చేస్తూవుంటే యీలాటివాళ్లకు జంకడమూ మానడమూ వుంటుందా ! నరకానికి వప్పుకున్న వాళ్ళకి పాపమంటూ లేదు; మరణానికి వప్పుకున్న వాళ్ళకి భయమంటూ లేదు. (నరకేసతి కో దోషః మరణేసతి కిం భయమ్) అని చెప్పిన పెద్దలు సర్వథా మాననీయులు. విషయం విషయాంతరంలోకి దిగి చాలా సేపయింది. పుత్రులకన్న ధనం యొక్కవుపయోగమనే సందర్భంలో ఆయీవిషయం వచ్చింది. ఆధనం కూడా తాను వ్యక్తి కలిగి వున్నంతవఱకేకాని వుపకరించదు. అసలది వక్తవ్యాంశం కనక దేన్ని ఆర్జించుకోవడం సర్వథా శ్రేయోదాయకం అంటే, జ్ఞానాన్ని ఆర్జించుకోవడమే అని చెప్పవలసి వస్తుంది. జ్ఞానమంటే ! రాజకీయశాస్త్రపరిజ్ఞానమా ? వృక్షశాస్త్రపరిజ్ఞానమా ? యింకా వుండే యితరపరిజ్ఞానములా అంటే, నహి నహి రక్షతి డుకృఞ్ కరణే అని శ్రీశంకరులవారు చెప్పనే చెప్పారు. వేదానికి అంగమవడమే కాకుండా యేజ్ఞానం అలవఱచుకోవలసి వచ్చినా అత్యంతసాధనంగా వుండి "శబ్దశాస్త్రం ముఖం" అని కీర్తింపబడే వ్యాకరణాన్నే తోసిరాజన్నప్పుడు యితరశాస్త్రపరిజ్ఞానాలు చిత్తశాంతిని కలిగించే వవుతాయా ! అందుచేత చిత్తశాంతిని కలిగించేధనం ఆత్మవిజ్ఞానం, అది సుఖసుఖాల లభించేది కాదు. పరమవిజ్ఞానులకుకూడా అది కలగడానికి యెన్నో ప్రతిబంధకాలు కనపడతాయి. కామక్రోధాదిశత్రుషట్కంలో కామపురుషార్థభ్రాంతి వార్ధక్యంలో వుండదని స్థూలదృష్టిని చెప్పడమేకాని అదల్లా వక్క దారేషణానికి మాత్రమే అనువర్తిస్తుంది. ఆదారేషణం కూడా కొందఱు వృద్ధులకు వదలనే వదలదు, అందుచేత "వయసి గతే కః కామవికారః" అన్నదికూడా సార్వత్రికం కాదు. "మనోరథానా మతటాః ప్రవాహాః" అని యెప్పటికప్పుడు ఆకామము నానావిధములుగా మనస్సులో ఆవిర్భవిస్తూనే

వుంటుంది. ఆ దెప్పుడు వుంటుందో దానితోపాటు క్రోధం తప్పనిదే. యీ రెండూ యేలాగో వదలినా లోభం వదలడం మహాకష్టం. దిక్కుమాలిన లోభం యిది ప్రాణం వున్నంతదాకానే కాదు తదనంతరం కూడా కొందఱిని వదలదు. ఆ కారణంచేతే పిశాచాలయి పీక్కుతింటారనేది వుపపన్నమవుతుంది. దీన్ని గూర్చి

చ. ఇదు మను ధర్మశాస్త్రకథ లిన్నియు మిథ్యలు కూడుమాత్రమున్
గుడుచుట దుర్వ్యయంబు కొడుకున్ బగవాఁ డడుగంగఁ జూచుచో.

అంటూ కవికర్ణరసాయనంలో వర్ణించి వున్నాడు. నామట్టుకు యీ లోభ గుణంకన్న దుర్గుణం మఱోటి లేనే లేదని తోస్తుంది. వార్ధక్యంలో శత్రుషట్కంలో పరిగణించినవాట్లలో తక్కిన అయినా తప్పుకున్నా యిది అంటిపెట్టుకుని వుండేదే అని తోస్తూవుంది. లోభగుణమంటే? ఆర్జితపదార్థరక్షణం. ఆ పదార్థం ధనధాన్యాదులే కావు. విద్యాదికంకూడా కావచ్చును. ధనధాన్యాదిరక్షణానికి యేవో వుపాయాలుంటే వుంటాయేమో ? విద్య తనది తనతోపాటుగా "సుకృతం దుష్కృతంచైవ గచ్ఛంత మనుగచ్ఛతి" అన్నట్టు వెళ్ళిపోదగ్గదేకదా ! యిది అందఱూ యెఱిగిందే. అయితేమాత్రం లోభగుణం అలా వూరుకోనిస్తుందా! చూడండీ దీన్ని గూర్చి నే నేలా వ్రాసుకున్నానో ?

మ. కలిగెన్ లేదనుకొన్న సంతతియు భాగ్యం బబ్బె నానందని
స్తుల మయ్యెన్ జనిషష్టిపూర్తియును నాకున్ దాపు గావచ్చె నో
లలితాంబా? యిఁక నొక్కకోర్కె అది వాలాయంబు మద్విద్యల
ర్మిలి మత్పుత్త్రులయం దమర్చుటయెసుమ్మీ? తల్లి? కామేశ్వరీ.

దీనిపే రేమిటి! లోభగుణమే. యీ పద్యం సుమారు పదేళ్ళకి పూర్వం రచించినది. యిప్పుడున్నూ యీ లౌభ్యం బాధిస్తూనేవుంది. ఆరచనాకాలానికి యిటీవల కలిగిన చిరంజీవికి నావిద్యను అభ్యసింప చేయడానికి యిప్పుడు ప్రయత్నం, తొమ్మిదేళ్ళవాడికి నావిద్య ధారపోయడం యేలాగ! సరే వాడికి యే శబ్ద మంజరో యేరఘువంశమో మొదలెట్టి అట్టహాసం చేస్తూ వున్నా ననుకుంటే యీ లోభం యింతతో శాంతిస్తూ వుందా ? నా పేరింటిగాఁడు రెండేళ్ళ లోపు మన్మఁడు చిరంజీవిగాఁ డున్నాడు. వాఁడికి నా పేరెట్టడంచేత నావిద్య రావాలని నేనే కాకుండా నన్ను ప్రేమించే లోకంకూడా అభిలషిస్తుందికదా ? మాతాత గారు రెండోకొడుక్కి మాముత్తాత నరసకవిగారి పేరెట్టి ఆవిద్య ఆయనకు అంటక పోగా యెల్లప్పుడూ "ఆయన పేరు పాడుచేశా"వని తిడుతూ వుండేవారని వినడం. పోనీ వాడికీ శబ్దమంజరి మొదలెట్టరాదా అంటే ? అది సాధ్యమా ? "పంచశర ద్వయస్కుఁడు" ఆయేదాకా మీరు ఆగరాదా అంటే ! అది నావశమా ? యీ సోది కంతకూ తాత్పర్యం లోభగుణం యెప్పటికీ వదలదని చెప్పడమే. యిది నా అనుభవాన్ని పట్టి వ్రాసేమాట. యీలాటి లౌభ్యం లేని వ్యక్తులు కూడా వుంటే వుంటారేమో ? కన్నసంతానమేమి, ఆర్జించిన విద్యాదులేమి,

సర్వమూ అంతశ్శతృవర్గంతో ముఖ్యస్థానాన్ని ఆక్రమించి స్థిరంగా వుండే లోభగుణాన్నే వృద్ధిపరిస్తే యింక గతేమిటి? అందుకే కాబోలును - "వేదశాస్త్రపురాణాని పదపాంసుమివ త్యజేత్, అంటూ వైరాగ్యసందర్భంలో ఒక వుపనిషత్తులో చెప్పబడి వుంది. ఇది వేదాంతవిషయం, ప్రస్తుతం వుపక్రమించింది అసలు సంసారంలో అందరూ ముఖ్యఫలంగా అభిలషించే కొడుకులనూ కూతుళ్లనూ గూర్చి. ముసలితనం వచ్చేటప్పటికి ఆకొడుకులు చేసే ఖర్చంతా దుబారాగా కనపడుతుంది. ఆదుబారాఖర్చు పూర్వపువాళ్ళది రిజాలాగా తిరిగేవాళ్ళకే వుండేది. యిప్పుడో? నిమధయోగ్యులుగా వుండి యేకపత్నీవ్రతులుగా వుండేవాళ్ళు చేసేఖర్చుకూడా ఒకటిరకం ముసలివాళ్ళకు దుబారాఖర్చుగానే కనపడుతూవుంటుంది. గ్రామఫోనునుగూర్చి కొంత వ్రాస్తాను. దాన్ని తెచ్చి యింట్లో అలంకరించింది మొదలు చంటిపిల్లలదగ్గిఱనుంచీ అస్తమానం దాన్ని వాడించవలసిందని వేపుకుతింటారు. అప్లేట్లలో యేకొన్నో తప్ప తక్కినవి కుక్కకూతా నక్కకూతాగా వుండడంచేతనైతేయేమి కొంత యుక్తంగావుండేవైనా సర్వకాలసర్వావస్థలయందున్నూ వింటూ వుండడంచేతనైతేయేమి తుదకు వాట్లపేరు చెపితే అసహ్యించుకోవడందగ్గిఱకు వచ్చింది వాట్లగతి. "అతిపరిచయా దవజ్ఞా"కదా? మచ్చుకు వకటి చూపాను. తక్కినవి కొత్తరకం యీతిబాధలు అనేవ్యాసంలో విస్తరించినట్లు జ్ఞాపకం, యీఫోను పెట్టె వున్నయింట్లో యెప్పటికప్పుడు కొత్తప్లేట్ల ఖర్చు తప్పదు. యిది కాక వాట్లనూదులు, ఆయీఖర్చులు అతాధకొర్లకు లెక్కలోవి కాకపోవచ్చును. సామాన్యగృహస్థులకు అట్టివి కావు. పయిగా యింట్లోవుట్లు సర్వకాలసర్వావస్థలయందున్నూ యీగొడవతో వుంటే యేపెద్దపిన్నలతోగాని మాట్లాడవలసివస్తే వొకరిమాట వొకరికి వినబడదు. అట్లని వారిస్తే వాళ్ళవుత్సాహాన్ని చెడగొట్టినట్టవుతుందని వూరుకోవడం. దీనివల్ల యింకోచిక్కు. చిరంజీవులకు చంటివుట్టలకు యేరఘువంశమో పాఠం చెపుతూ వుంటే అవతల యీఫోను ప్రారంభిస్తారు. దానితో ఆచదివే పుస్తకం అక్కడ పారేసి ఆవుట్టులు ఆఫోనుదగ్గిఱ కూర్చుంటారు. పూర్వనాగరికతకూ కొత్తనాగరికతకూ సంధికాలంలో వుండే తండ్రీకొడుకులవ్యాసంగాలు వొకరివి వొకరికి సంబంధించవన్నందుకు యీవిషయం దీనిలో ప్రస్తావించాను. గ్రామోఫోను కనిపెట్టిన పురుషుణ్ణి నేనేకాదు అందరూ అభినందించి తీరుతారు కాని అది వ్యాపించిన పిమ్మట గానమందు వుండే గౌరవం పూర్తిగా నశించిందంటే వొప్పనివారుకూడా వుండరనుకుంటాను యిప్పటి నాగరికత అనేకవిధాల గృహస్థులకు బాధకంగా కనపడుతుంది. పట్నవాసాల్లో పిల్లలతోపాటు పెద్దలుకూడా యీనాగరికతకు అలవాటుపడే వుంటారు. కనక దీనివల్లవచ్చే బాధ అంతగా కనపడదు. పల్లెటూళ్ళలో వుట్టకారుతప్ప యింకా యీనాగరికతకు ముసలివాళ్ళు అలవాటు పడనికారణంచేత కొంత యెటామొటీగా వుంటుంది. పోనీ "కాటికి కాళ్ళు చాచుకొన్న" మన కెందుకు వాళ్ళగొడవ అని వూరుకొనే విజ్ఞాను లెక్కడా కనపడరు. యేవో శ్రీరంగనీతులు వుట్టలకు బోధిస్తూనే వుంటారు. వాళ్ళో వినకుండానే వుంటారు. వార్ధక్యలక్షణాలలో యీ

నీతిబోధకూడా లోకలక్షణం. కేవలమూ లక్షణమాత్రమే కాదు ప్రధానలక్షణం కూడాను ("కోపముబ్బుట చిన్నవాళ్లకున్ హితమ్ములు చెప్పుటల్") యివన్నీ వృద్ధలక్షణాలే. యివియెంత యుక్తంగా వున్నా కటుప్రాయమైన మందులమాదిరిని వినేవాళ్ళకు అనుష్ఠేయాలుగా వుండవు పూర్వకాలంలోకూడా వృద్ధులు చెప్పే మాటలను యువకులు అంతగా పాటించడం వుండేది కాదు. యీకాలంలోనో చెప్పేదేమిటి? విద్యాహీనులుగా వుండే కొడుకులకున్నూ విద్వాంసులుగా వుండే తండ్రులకున్నూ ప్రతివిషయంలోనూ మతభేదం కలగడం యుక్తమే. అందుకే కాబోలు. "పుత్రశ్శత్రు రపండితః" అని పూర్వులు నిర్వచించి వున్నారు. అంతో యింతో విద్య వుండికూడా వృద్ధుగా వుండేతండ్రిహితబోధకు లోబడక పోవడం యిప్పుడు సర్వేసర్వత్ర కాకపోయినా విస్తరించి కనపడుతుంది. వృద్ధుల అభిప్రాయాలకున్నూ యువకుల అభిప్రాయాలకున్నూ అనేకసందర్భాలలో భేదం వుండడం సర్వానుభవసిద్ధమే. భేదం వుండే సందర్భాలలో వృద్ధులు ప్రాజ్ఞులే అయితే అడ్డు తగిలే మాటలు చెప్పనే చెప్పరు. "ముదిమది తప్పితే మూడుగుణాలు" అన్నట్టుగా వృద్ధులు అట్టి సందర్భాలలో చెపితే వినకుండా వున్నా అనుకో తగ్గది లేదుకాని ప్రతిదానికిన్నీ అనాదరమే చూపడంమాత్రం యుక్తం కాదు. సర్వత్రా కాకపోయినా పలుచోట్ల యిదే కనపడుతుంది. అందుచేతే కాబోలు

శ్లో. వశ్యాస్సుతా విత్తకరీచ విద్యా, నిరోగతా సజ్జనసంగతిశ్చ
ఇష్టాచ భార్యా వశవర్తినీచ, దుఃఖస్య మూలోద్ధరణాని పంచ.

అంటూ సంసారసుఖహేతువులను యేకరు పెడుతూ మొట్టమొదటే "వశ్యాస్సుతాః" అని ప్రారంభించినట్టు తోస్తుంది. సుతాః అంటే ! కూతుళ్లు కూడా అర్ధమవుతారుగాని వాళ్లు అత్తవారింటికి వెళ్ళి పోయేవాళ్లే కనక తండ్రికి అదుపాజ్ఞలలో వున్నారాలేదా అనే విచారంతో అంతగా పని వుండదు. అత్తింటి వద్ద "అమ్మకు రెండూ అబ్బకు రెండూ" అనేమాదిరిగా సంచరించక పోవడమే మనభారతీయులు కోరేది, యేజంఝాటమూ లేని కణ్వుడుకూడా శకుంతలకు

శ్లో. శుశ్రూషస్వ గురూన్ ...వామాః కులస్యాఽఽధయః.

అంటూ బోధించి వున్నాడు. బాగా ఆలోచిస్తే రాజర్షి విశ్వామిత్రుని సంతానమే అయినా తల్లినిబట్టి శకుంతల వేశ్యాపుత్రిక. అట్టిదాన్ని దుష్యంతుడు పరిగ్రహించడమే తప్పుగాని ఆపె అన్యధాగా అంటే అవిధేయురాలుగా వర్తించే యెడల ఆమె ననవలసే వుండదు. అట్టిపిల్లయైనప్పటికి ఋషికన్యకలతో పాటు కణ్వునిచేత పెంచబడింది కనక ఆకన్యకల కేలాటిబుద్ధులు తల్లిదండ్రులు చెప్పడం ఆచారమో ఆలాటిబుద్ధులే కణ్వుడు వుపదేశించాడు. పల్లెటూళ్లలో కన్యకలు యిప్పటికే యిలాటి బుద్ధులకే అలవాటు పడి తల్లిదండ్రులకు గౌరవం కలిగేటట్టే తమతమకాపురాలు నిర్వర్తించుకుంటూ వున్నారు, అత్తవారిలోపాలనుబట్టి క్వాచిత్కంగా యేటామోటీలున్నూ కనపడతాయి గాని అమాత్రమూ లేకుండా సర్వత్ర మంచిని స్థాపన చేయడం మనుష్యులకేకాదు భగవంతునిక్కూడా సాధ్యం

కాదు. పట్నవాసపు కన్యకలుకూడా యింతవఱకు నూటికి తొంభైతొమ్మండుగురు తల్లిదండ్రులకు తలవంపులు లేకుండానే వారివారి కాపురాలు నిర్వర్తించుకుంటూ వున్నారు. మిగిలిన వకవ్యక్తికిన్నీ తల్లిదండ్రులవల్లనే కొంత అనుపయుక్తమైన స్వాతంత్ర్యం కలగడమున్నూ తద్వారాగా బ్రహ్మచర్యం అవలంబించడమున్నూ సంఘటిస్తూ వుంది. ఆబ్రహ్మచర్యం యేకొంత కాలమో జరిగిన తరవాత గృహిణీత్వం కూడా కొందఱికి ప్రాప్తించడం కలదుగాని అగృహిణీత్వం జాతిమతాదులకు బొత్తిగా సంబంధించక పోవడంచేత తల్లిదండ్రులకు తలవంపులుగా వుండేదే అయినా ఆతలవంపులకు కారణం మొదటినుంచీ తమ ఏర్పఱచినవిధానమే కావడం చేత ఆతల్లిదండ్రులు యితరులకుకూడా ఆవిధానాన్ని బోధించేవారుగా కూడా వుంటూవున్నారు. ఆ మాత్రంచేత ఆతల్లిదండ్రులకు హృదయంలో విచారం లేదనుకోవడానికి వల్లకాదు కాని భారతదేశమంతా ఆశోకంలోకే యెప్పుడు వస్తుందో అప్పుడు అట్టి విచారానికి అవకాశం వుండకపోవచ్చునేమో! అప్పుడే నా సావిత్రివలె సంచరించే కూతుళ్ళు తల్లిదండ్రులకు గౌరవం లేదా ఆనందం కలిగిస్తారుగాని మఱో మాదిరివాళ్ళు కలిగించలేరు "ప్రామాః కులస్యాధయః" అన్న కాళిదాసు సామాన్యుడు కాఁడు. కుమార్తెలు పెద్దపెద్దవుద్యోగాలు చేసి సంపాదించుట, అల్లుళ్ళు వున్నచోటికీ కుమార్తెలు వున్నచోటికీ రైలులోకూడా ప్రయాణం చేయవలసివస్తే వకటిరెండురోజులు పట్టుట, యీలాటివి యేతల్లిదండ్రులకున్నూ అభినందనీయాలుగా వుండవనే నేననుకుంటాను దమయంతికి ఆపత్సమయంలో కూడా పుట్టింటికి వెళ్ళడంకన్న భర్తతో అరణ్యానికి వెళ్ళడమే సుఖకరంగా తోచడమేమో! సీతకుకూడా అరణ్యవాసమే రుచించడమేమో! ఆతలిదండ్రులుమాత్రం యెఱుగరా! ఆ యీవుద్యోగాలకున్నూ సంపాదనకున్నూ బాల్యవైధవ్యం వచ్చి తిరిగి గృహస్థాశ్రమస్వీకారం చేయడానికి యిష్టంలేని బ్రహ్మచారిణులు తగి వుంటారు. అంతేకాని గేహినులు తగివుండరు. అవివాహితలుకూడా తగి వుండరనే నా తాత్పర్యం. "బలవా నింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి" అనే ఋషివాక్యం తోసిరా జనతగింది కాదు. కులగౌరవాన్ని నిల్పుకోవడం ఆచండాలబ్రాహ్మణ పర్యంతము అందరికీ ఆవశ్యకమే. ఆగౌరవం స్త్రీలవల్లనే యింతవఱకున్నూ కాపాడబడుతూ వుంది. యిక ముందుకూడ వాళ్ళవల్లనే కాపాడబడవలని వుంటుంది. కాని అలాటికూఁతుళ్ళు లభ్యమవుతారా? అనేదే పెద్దసంశయం లోకమంతా స్త్రీస్వాతంత్ర్యమో అని పాకులాడుతూ వుంది. దానికి తగ్గ రాజశాసనాలు యెప్పటికప్పుడే పుడుతూ వున్నాయి యిట్టిస్థితిలో యెంతమంచికూతుళ్ళు వున్న గృహస్థుకేనా మాట దక్కడం యేలాగ? అందుచేత బ్రహ్మచర్యంతో కాలం వెళ్ళించిన గృహస్థుకుతప్ప మనశ్శాంతి వుండడానికి అవకాశం కనపడదు. లేదా! కొత్త నాగరికత బాగా నాశనానికి యొక్కినపుణ్యాత్ములకయితే మనశ్శాంతి కలుగుతుంది. అట్టివాళ్ళు యిదివఱకు పుట్టినవాళ్ళల్లో చాలా తక్కువగా వుంటారు. యిక పుట్టేవాళ్ళల్లో వుంటే యెక్కువగా వుంటారేమో యేలాగేనా యేకులస్థుడు అకులస్థురాలిని పెళ్ళాడడమున్నూ యేకులస్థురాలు అకులస్థుణ్ణి పెళ్ళాడడమున్నూ

వాళ్ళవాళ్ళ తల్లిదండ్రులకు మనశ్శాంతికరంగా వుంటాయి కాని అన్యథాగా వుండే వివాహాలు వగయిరాలు మనశ్శాంతికరాలు కాజాలవు. యెవరికి యీ సందర్భంలో భారతీయులకు దానికి భిన్నమైన పద్ధతి దాపరించడానికి సర్వసిద్ధంగా వుంది. వాళ్ళువాళ్లు కులాభిమానానికి కట్టుపడి వుందామన్నా వుండడానికి అవకాశం కనపడదు. కొడుకు మైనార్టి వదలినవాడే అయినా జాత్యంతరకన్యకను పెళ్ళాడ తానంటే తండ్రి వారించడానికి కొంతేనా అవకాశం వుండేది మునుపు. యిప్పుడో? అదికూడా యుక్తమే అని చెప్పేసంఘం కొంత వుండడంచేత ఆ అవకాశం కాస్తా పోయింది. యీమధ్య భార్యా వున్నవాడే వొక యువకుడు వితంతువును పెళ్ళి చేసుకు వచ్చాడు తల్లిదండ్రులు యేమీ చేయలేక విచారించవలసినవారైనారు. ఆమధ్య వొక యువకుడు తాను చదువుకొనే పాఠశాలలోనే వొక క్రైస్తవకన్యకను వరించి ఆవరించడం సంతానసూచనద్వారాగా వివాహంగా పరిణమించవలసివచ్చి ఆ సంఘంలోకి చేరవలసినవాడే అయినాడు. తండ్రిగారు అగ్నిహోత్రంవంటి కుటుంబంలోవారు. తరవాత ఆ క్రైస్తవభార్య వొక కొడుకును కని దైవవశంవల్ల చనిపోయింది పాపం! ఆ అవకాశంలో కుమారుడికి యెంతో బోధ చేసి తండ్రిగారు మళ్ళా స్వమతంలోకి చేర్చుకుందామని ప్రయత్నించారు. ఆ క్రైస్తవకన్యకాపుత్రుడికి పోషణనిమిత్తమే కాకుండా విద్యాభ్యాసాదికానికిన్నీ కూడా నెల 1కి కొంత సొమ్ము యేర్పఱచవలసిందనిన్నీ; జరిగిందేమో జరిగింది, నీవు మట్టుకు స్వజాతిలో చేరవలసిందనిన్నీ చాలా విధాల కొడుకుని బ్రతిమాలుకున్నాడు తండ్రి. ప్రయోజనం లేకపోయింది. మళ్లా ఆకుమారుడు క్రైస్తవకన్యకనే పెళ్లిచేసుకున్నాడు. పోనీ యీయన మొట్టమొదట క్రైస్తవమతప్రాశస్త్యాన్ని బట్టి ఆర్యమతంలోనుంచి ఆమతంలోకి వెళ్లినవాడేమో అనుకుంటే అలా జరిగినట్టు లేదు. యేదో దైవికంగా పాఠశాలలో సంబంధం యేర్పడింది. తద్ద్వారాగా ఆమతంలోకి వెళ్లవలసి వచ్చింది. ఆ సంబంధాన్ని దైవమే విచ్ఛిన్నం చేసినప్పటికీ మళ్లా వెనక్కి రావడానికి ఆయనకు లజ్జగా కనపడింది. లోకంలో యెందఱో యీలా మతాంతరప్రవిష్టు లయిన వ్యక్తులు యీ పందొమ్మిదీ యిరవై శతాబ్దాలలో వున్నారు. వారందఱూ తల్లిదండ్రులకే కాదు కొందఱు భార్యలకుకూడా దుఃఖాన్ని కలిగించే వుంటారు. కాని ప్రస్తుతం వ్రాసిన సందర్భం మఱీ శోచనీయంగా వుండడం చేత యింతగా ప్రస్తావించాను. నేను వుదాహరించిన కుటుంబానికి యీ అవస్థ తటస్థించిందంటే సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మకుటుంబానికే తటస్థించిందన్నమాట. యేలాటికుటుంబాలకేనా సరే! యిప్పుడు కొడుకులవల్లా కూతుళ్ళవల్లా వచ్చే పరువు ప్రతిష్ఠలు కనపడవు. యిది వక్క బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులకు మాత్రమే కాదు. జాత్యభిమానమంటూ వున్న ప్రతికులీనులకున్నూ వున్నదిక్కే. బ్రాహ్మడికి చండాలుడు అల్లుడు కావలసివస్తే ఆ బ్రాహ్మడు యెంత విచారపడతాడో చండాలుడికి బ్రాహ్మడు అల్లుడయినప్పుడున్నూ ఆ చండాలుడు అంతే విచారపడతాడు. నాకు యెక్కువజాతిపిల్ల కోడలయింది గదా అని సంతోషించడం తటస్థించదు. యింకా సర్వత్రా యీసంబంధబాంధవ్యాలు యేర్పడక పోవడంచేత దీన్నిగూర్చి

వ్రాసేవ్రాత భావనమీఁద ఆధారపడి వుంటుంది. సంధికాలం కొంత అయోమయంగా వున్నప్పటికీ "లాకుసట్టం" అయితే సరేపోతుందేమో! యేమైనా యీసంధికాలం చాలామంది గృహస్థులకు ప్రాణగొడ్డంగా కనపడుతూ వుంది. పూర్వకాలపు సంగతి సందర్భాలకు యిప్పటికాలపు సందర్భాలకూ యెన్నో విషయాలలో భేదం వున్నా యిప్పుడు రాబోయే వివాహాది మార్పులు తలచుకుంటే గుండె బేజారవుతూ వుంది. యెప్పుడేనా గతమే మంచిగా వుంటుందనడానికి భారతంలో వున్న—

క. "మతిఁ బరికింపఁగ జీవిత
మతిచంచల మెండమావులట్టులు సంప
త్ప్రతతు లతిక్షణికంబులు
గతకాలము మేలు వచ్చుకాలముకన్నన్"

అనే పద్యం సాక్ష్యమిస్తూ వుంది. రాబోయె కాలవైఖరి చూడడానికి మాబోటి వృద్ధులకు యింకా దీర్ఘాయుర్దాయం పట్టవలసివస్తుంది. పట్టకుండా జీవితం అంతరించినవారు కొంత అదృష్టవంతులని సంతోషించడానికి తగ్గకాలం రానై వుంది. కాలం భగవత్స్వరూపం. అది అనేకమార్పులను చూపిస్తుంది. అనేక జన్యజనక భావాలు అనేక భార్యాభర్తృభావాలు, వొకటేమిటి? యెన్నో విశేషాలు రాబోయేకాలం ప్రపంచానికి చూపించ వలసి వుంది. ఆమార్పులే ప్రపంచానికి శ్రేయోదాయకాలని యెక్కువ రాజకీయపరిజ్ఞానం కలవేత్తలు చాటుతూ వున్నారు. అవి నిజమైన శ్రేయస్సుకుమార్గాలు కావని యేభాండసులో మొఱ పెట్టినా అమాటలు యెక్కువ. అందులో యిప్పుడు పత్రికలు చేస్తూ వున్న ఆందోళన మఱీ దుర్భరంగా కనపడుతుంది. "అదుగో పులి, అంటే యిదుగో తోక" అన్నమాదిరిగా యెన్నో కొత్తవిషయాలు ప్రకటిస్తూ వుంటాయి పత్రికలు. అవన్నీ నిజమే అనుకోవడమే కాని చర్చించి సత్యం తేల్చే శక్తి సామాన్యులకే కాదు విశేషజ్ఞులకు కూడా సాధ్యపడదు "గతానుగతికో లోకో నలోకః పారమార్థికః" అందుచేత యీకాలంలో కొడుకులనూ కూతుళ్లనూ కన్నవారిలో అనేకులకు మనశ్శాంతి లేదని వ్రాయవలసి వచ్చింది. యీ వ్రాయడం కొత్తనాగరికతకు అలవాటు పడ్డ కుటుంబీకులకే. వారిలోకూడా కొందఱు అదృష్టవంతులు లేకపోలేదు. కాని మిక్కిలీ మృగ్యంగా వున్నారు. వకసంపన్నగృహస్థు తనకు వొక్కర్తె కుమార్తె అవడంచేత ఆవిడకు కొత్తరకంగా విద్యాభ్యాసం చేయించడం తటస్థించింది. ఆ రోజుల్లో ఆ అమ్మాయిని నేను చూచాను, యిటీవల సంతానవతి అయిన పిమ్మట కూడా చూశాను. ఆపెకు విద్యలో చక్కటి జ్ఞానం కుదిరిన హేతువుచేతో పూర్వజన్మసుకృతంవల్లనో కాని తలిదండ్రులు విచారించతగ్గ పోకిళ్లు అభ్యాసం కాలేదు. ఆగృహస్థుకున్నూ పల్లెటూళ్లల్లో వుండే అస్మదాదులకున్నూ యీ విషయంలో ఐశ్వర్యభాగంలో తప్ప యితరసంగతులలో భేదం కనపడలేదు. కాని యెందఱో విచారిస్తూ వున్నగృహస్థులు లోకంలో లేకపోలేదు. అట్లని కొత్తనాగరికతకు

దూరంగా వుండడానికి యోగ్యమద్ధుకేనా అవకాశంవుందేమో? అంటే? అట్టి అవకాశం వున్నట్టు కనపడదు. కూతురు గొంతుక గార్ధభస్వరమయినా సరే తండ్రికి హార్మోనియం కొనడం తప్పదు. పిల్లను వచ్చే పెళ్ళివారు విచారించే గుణగణాలలో ప్రధానమయిన గుణం యీ గాన విద్యాప్రావీణ్యమే. కూతుళ్లకిగాని కొడుకులకుగాని తల్లిదండ్రులే కొత్తపద్ధతులు నేర్పవలసి వస్తూ వుంది. యిష్టం వున్నా వుండకున్నా ఆపద్ధతులు నేర్పించక తల్లిదండ్రులకు మరో మార్గం లేదు. యింకా రాలేదుగాని నేడో రేపో నిర్బంధవిద్యాభ్యాసచట్టం రాబోతుందికదా? ఆపాఠశాలలన్నీ జాతిసాంకర్యాదులకు వుద్బోధకాలే. టీకాలతోపాటు ఆ పాఠశాలలకు పంపడంకూడా తప్పనిదే. పంపకపోతే ప్రాసిక్యూషన్. సరే యిప్పటికింకా ఆచట్టం రాలేదే అనుకుందాం; నాబోటి చాదస్తుడు స్కూలుకు పంపక యింట్లోనే అక్షరాలదగ్గిఱనుంచీ పిల్లలకు చెప్పుకుంటూ వున్నాఁ డనుకుందాం. లోకంలో యీలాటి తండ్రి లెందఱు వుంటారు? ప్రపంచకరీతి సర్వమూ ఆ నాగరికతకు "దాసోహం" అనవలసిందేకదా? యిట్టికాలంలో సంతానంవల్ల మనశ్శాంతి కలగడం యేలాగ! ఆమధ్య వకస్కూలుమాస్టరుగారు "రిటయి" రవుతుండగా ఆయన్ని గౌరవించడానికని మావూళ్లోనే ఒకసభ పెట్టుకున్నారు. నన్ను ఆసభకు ప్రెసిడెంటుగా వుండవలసిందన్నారు. వున్నాను. అక్కడికి వచ్చినచుట్టుపట్ల మాస్టర్లనందఱినీ సందర్శించాను. యిప్పటినాగరకతాప్రభావాన్ని కొంత అవగతం చేసుకున్నాను. అప్పుడే నాకు యీ వ్యాసం వ్రాయవలసిన ఆవశ్యకత యేర్పడింది. సుమారు యిరవైయేళ్లేనా అతిక్రమిస్తేకాని యీలాగ వుండే తల్లిదండ్రులకు సంతానంవల్ల మనశ్శాంతి వుండడం కష్టసాధ్యమని తోచింది. అన్నిజాతులూ అద్వైతభావాన్ని పొందడానికి యింకా యిరవై యేళ్లు పడుతుందనిన్నీ అప్పుడు సంతానవంతులకు సుఖం కలుగుతుందనిన్నీ యీసంధికాలం యెంతత్వరలో అంతరిస్తే అంతమంచిదనిన్నీ అనుకున్నాను. యేసంధికాలమూకూడా యీలాగే వుంటుంది. ఆసంధికాలాల్లో పోయిన మనశ్శాంతి యేదోవిధంగా మళ్లా కుదుటఁబడుతూ వుంటుంది. అట్టి మంచికాలం త్వరలో వచ్చుఁగాక.

—♦ శ్రీశ్రీ జగద్గురు విరూపాక్షపీఠాధిపతులకు స్వాగతము ♦—

(గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు - గద్వాలసంస్థానము)

తే. గీ. ఆదిశంకర దివ్య హృదంతరాళ
కమ్రపీఠంబుపైన సంకల్పమాత్ర
మునఁ దదీయపదబ్జపాసనపరాగ
భూతు లస్మద్గురుల్ వీరు. మ్రొక్కు కవిత ! 1

సీ. మదవైరిరాట్శిరోమణులు కానుకలందు
ధారుణీశ్వరు లిందు దాసజనులు.

ప్రతివాదిదుర్దమపాండిత్యశౌండీర్య
　　　　శేముషీధను లిందు శిష్యకోటి.
నిగమషడ్దర్శనవిచయోపనిషదర్థ
　　　　వీక్షణు లిచట ముముక్షువితతి.
ఆత్మార్పణంబుగ నాతిథ్య మొనరించు
　　　　భక్తు లియ్యెడల సేవకగణంబు.
శ్రీజగద్గురుభారతీసిద్ధతీర్థ
సచ్చిదానందశంకరాచార్యవర్య
ప్రకటపదపద్మమకరందరసము లొసఁగు
కృతి నొసఁగి కూర్చుమా నమస్కృతులు కవిత! 2

మ. రసనిష్యందములై గుణోజ్జ్వలములై రమ్యంబులై వాసనా
లసమానంబులునై స్వభావరచనాలంకారమాత్రంబులై
రసికామోద మొసంగఁగాఁ దగిన సారగ్రాహిశబ్దాళి పెం
పెసఁగం బూజనొనర్చు రాఘవుఁడు. స్వామీ! దీవనల్ గూర్చుమా.

క. దురితక్షయకరమని తమ। చరణార్చన మెల్లజనులు సాగింతురు. మీ
గురు పరమగురు భవద్గురు। చరణంబులపూజ నేను సలిపితి లిపితోన్.

మ. కుసుమంబుల్ క్షణశోభితంబులు జగద్గోళస్థ నానావిశే
షసమంతార్చనముల్ లయోదయము లీశబ్దార్థశయ్యానట
ద్రసనిష్యందకవిత్వదివ్యరచనారంభప్రియంభావుకా
ర్చ సదా సన్నిధి వన్నె దగ్గదని నే సంధించితిన్ దేశికా! 5

చ. ఎనుట నశించు పూజలకె హెచ్చుగ భాగ్యముగల్గినన్ సదా
ముదమొదవించి దేశికత ముక్తిపదంబును జాటుఁ జాటువై
సదమలకీర్తిరూప మిదు చక్కని సత్కృతిపూజ కీయెడన్
గొదవలభించు నెట్లనుచుఁ గోరి రచించితి దేశికాగ్రణీ! 6

ఉ. శారదచంద్రమఃకిరణసంగతిఁ జాల్కొను చంద్రమశ్శిలో
ద్గారిరసప్రవాహములు గండశిలన్ జనియింపనట్లు వి
ద్యారుచిరావతార! తమయంతికమందుఁ గవిత్వమాధురీ
సారము పేరుపెంపెసఁగు శారద శారదగాక నీరదా? 7

సీ. శ్రీమద్విరూపాక్షసిద్ధపీఠస్థానసకలజగద్గురూ! స్వాగతంబు.
షణ్మతస్థాపనాచార్యాది దేశికసాధుమార్గానంద! స్వాగతంబు.

శ్రీభాష్యకారప్రసిద్ధవిద్యారణ్యసంకల్పసామ్రాజ్య! స్వాగతంబు.
అభినవోద్దండవిద్యాశంకరాదివిశ్వస్తుత్యబిరుదాంక! స్వాగతంబు.
సచ్చిదానందతత్త్వార్థసరసమధుర
మృదులవచనానురచనాప్రమేయగేయ
విద్వదుద్దండనికరసంవేష్ట్యమాన
భోగనిజపీఠ! తమ కిదే స్వాగతంబు. 8

సీ. విజయమా ప్రణవార్థ వేద వేదరహస్య
పూర్ణవిజ్ఞానప్రబోధమునకు?
క్షేమమా శరణార్థిశిష్యజనోద్ధార
నైకదీక్షాదృశాలోకమునకు?
ఆనందమా సదా ధ్యానగమ్యపరాత్ప
రావతారారాధనార్హమునకు?
భద్రమా దుర్మతప్రత్యగ్రఖండన
డిండిమమ్మైన పాండిత్యమునకు?
శుభమ ప్రభుశక్తికల్పితశ్రుతినిగదిత
ధన్యవాగ్జన్యతాత్త్వికాద్వైతమునకు?
కుశలమా మోక్షలక్ష్మీప్రకోష్ఠ మొసఁగు
భావుకాశీస్సులకు గురుప్రభువరేణ్య! 9

శ్రీమజ్జగద్గురుమత విమర్శనము.

(వారణాసి వేంకటనారాయణశాస్త్రిగారు)

శ్రీ కామకోటి పీఠాధీశ్వరులు కొన్ని సంవత్సరములకుఁ బూర్వము స్వస్థానమగు కుంభకోణమును వదలి శ్రీ కాశీయాత్ర వెడలవేర్చుకొని మధ్యదేశమున సంచారము చేయుచుఁ గ్రమముగా గుంటూరునఁ జాతుర్మాస్యవ్రతమును వెడలవేర్చి కర్నూలుజిల్లాకు దయచేయుచున్నారు. ప్రస్తుత మీపీఠాధ్యక్షులును బరమహంస పరివ్రాజకాచార్యేత్యాది బిరుదాంకితులునగు శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వాములవారు పండితులు. ఉపశాన్తులు. తపస్వులు. ధీరులు. వదాన్యులు. ఉచితజ్ఞులు. సర్వవిధములను శ్లాఘాపాత్రులనుటకు సందియము లేదు. కాని వీరు శిష్యులద్వారముననఁగాని స్వయముగాఁగాని చేయుచున్న ప్రచారము గురుభక్తులకును దత్త్వాన్వేషులకును వ్యామోహకముగా నున్నందున విమర్శింపవలసివచ్చినది. అనేకశంకరవిజయములు భిన్నభిన్నప్రస్థానములుగాఁ బరస్పరవిరుద్ధములుగా నున్నను శ్రీ మాధవీయశంకరదిగ్విజయము సకలదేశస్థితపండితులచేతను బ్రామాణికముగా నంగీకరింపఁబడుచున్నది. మఠామ్నాయమను గ్రంథముకూడ సర్వసంప్రతిపన్నము.

శ్రీశంకరభగవత్పాదు లుజ్జయినీ పట్టణము మధ్యస్థానముఁజేసి భారతవర్షము నాల్గు దిక్కులఁ ధర్మసంరక్షణాధికారమును స్వీయశిష్యాగ్రగణ్యులగు సురేశ్వర పద్మపాద తోటక హస్తామలకాచార్యుల కొసంగి దిగ్విజయానంతరము హిమాలయమున వృషభవాహనాధిరూఢులై ప్రమథగణసంస్తూయమానులగుచు సశరీరులై కైలాస యాత్ర సలిపినట్లు శ్రీమాధవీయ దిగ్విజయమున వర్ణింపఁబడినది. శ్రీకామకోటి పీఠాధ్యక్షులును వారి శిష్యులును నీసిద్ధాంతమునకు వ్యతిరేకముగాఁ బ్రచారముచేయుచున్నారు. ఆద్యశంకరాచార్యులు దిగ్విజయము చేసి శిష్యులకు నాల్గుదిక్కులందు నాల్గు ధర్మపీఠముల నియమించి యాపీఠముల కధ్యక్షులుగాఁబూర్వోక్తులగు నలుగురు శిష్యులను నియోగించి తాము స్వయముగా శ్రీకాంచీ క్షేత్రమం దొక మఠమును నిర్మించి యక్కడనే నివసించి నిర్యాణముఁ జెందిరనియు వారి సిద్ధిసమయమున నా కృత్స్న భారతవర్ష ధర్మవ్యవస్థాపనాధికారమును వారిస్థానమం దధిష్ఠించిన యొక శిష్యున కొసంగిరనియు నట్టిసంప్రదాయస్థులు తామేయనియు శృంగగిర్యాది పీఠాధిపతులు పరిచ్ఛిన్నాధికారము కలవారనియు వారు గురువులే కాని జగద్గురువులు గాఁజాలరనియు జనుల కర్థమగునట్లు ప్రచారము చేయుచున్నారు - దీనిని బలపఱచుటకుఁగా నాయాదేశములలోఁ బండితులయొక్కయు గృహస్థులయొక్కయు మహాజర్లను నానోపాయములతో సంపాదించుచున్నారు - కావేరీతీరస్థుఁడగు మహాకవి భట్టశ్రీనారాయణశాస్త్రిగారు విమర్శించి శ్రీకామకోటిపీఠము మధ్యకాలప్రవృత్తముగాని శ్రీశంకరులు మొదలుగా నవిచ్ఛిన్నప్రవృత్తము గాదని షుమారు 50 సంవత్సరములకు లోఁగా వ్రాసిన విమర్శనమున కిప్పుడు శ్రీపంచానన తర్కరత్నభట్టాచార్యుల ద్వారమునఁ బ్రతివిమర్శనము వ్రాయించిరి. శృంగగిర్యాది ధర్మపీఠములపై నెవరివిమర్శనములు లేవు- ప్రతిఖండనములు లేవు- వీరి పీఠముసంగతి మఠామ్నాయమందుఁ గాని మాధవీయ శంకరవిజయమునఁగాని కనుపట్టదు. శ్రీమదాచార్యులు కాంచియందు శ్రీచక్రప్రతిష్ఠనుజేసినట్లును నక్కడఁ గొంతకాలము నివసించినట్లును గలదుకాని సకలభారతవర్ష ధర్మాచార్యత్వమును సకలపీఠాధ్యక్షులపై సర్వాధికారమును దా ముంచుకొనినట్లును దమ యవసానకాలమున నీసర్వాధికారము శిష్యపరంపరచే సంక్రమించునట్లు లొకశిష్యున కిచ్చినట్లును వీరు ప్రమాణముగాఁ గనఁబఱచిన యానందగిరికృతశంకరవిజయ శివరహస్యములందుఁ జూపించియుండలేదు. శివరహస్యమునఁ“ గాంచ్యాంఖలు సిద్ధిమాప” అనుశ్లోకమునకుఁ బైని బదునైదుశ్లోకము లన్యత్ర ముద్రితపుస్తకములలోఁ గలవు. అయ్యవి యాచార్యస్వామివారి సశరీరకైలాసయాత్రను జెప్పుచున్నవి. ఆనందగిరికృతమగు శంకరవిజయము 1867 సంవత్సరమునఁ జెన్నపురిలో ముద్రితమగుదానిఁజూచితిమి. దానియందు శ్రీశంకరులు చిదంబర క్షేత్రమున దేశాన్తరగతుఁడైన విశ్వజిత్తను బ్రాహ్మణుని భార్యయగు విశిష్టయందుఁ జిదంబరేశ్వరునివలన జన్మించినట్లును నింకను ననేకవిరుద్ధాంశములు వర్ణింపఁబడినవి.

ఈకథ శివరహస్యమునకును నితర శంకరవిజయములకును విరుద్ధము. “ద్వాత్రింశ త్పరమాయు స్తే శీఘ్రం కైలాస మావస” అని మాధవీయశంకరవిజయమున శ్రీమదాచార్యుల యాయుఃప్రమాణము ద్వాత్రింశద్వత్సరములని కలదు. వ్యాసులు “జీవేత శరదాం శతం” అని శ్రీశంకరులకు గంగాభిషేకముఁ జేసినట్లు ౫౭వ పత్రిక

రణమున నానందగిరిశంకరవిజయమునఁ గలదు. ఇట్టి విరోధము లనేకములుఁ గలవు. సురేశ్వరాచార్యులు శృంగగిరిపీఠాధ్యక్షులుగా నియమింపఁబడిన ట్లితరశంకరవిజయములలోఁ గలదు. శృంగగిరిక్షేత్రమున సురేశ్వరుల సమాధి గలదు. దానికి నిత్యపూజాదులు జరుగుచున్నవి. జగత్ప్రసిద్ధములగు శృంగేర్యాది పీఠములు మధ్యకాలప్రవృత్తములను వాదమే గగనకుసుమాయమానము. విరూపాక్ష పుష్పగిర్యాదులు శృంగగిరిలోని యంతర్భాగములని వారివారి బిరుదపరంపరయే చెప్పుచున్నది. 1848 విక్రమశకములోఁ గాశీస్థమహాపండితు లందఱు

శ్లో. మఠా శ్చత్వార ఆచార్యా శ్చత్వారశ్చ ధురంధరాః
సంప్రదాయాశ్చ చత్వార ఏషా ధర్మవ్యవస్థితిః.

ఇత్యాది నియమములతో నొక తీర్మానము గావించియుండిరి. దానియందు సర్వతంత్రస్వతంత్రులగు శ్రీ శివకుమారమిశ్ర కైలాసచంద్రభట్టాచార్యప్రభృతుల సమ్మతులుఁ గలవు. గురువుల బిరుదముల శిష్యు లుదాహరించుట కలదు. వీరిపీఠము సకలపీఠములకు మూలభూత మగునెడల వీరిబిరుదములను శృంగగిర్యాదిపీఠస్థులు తమబిరుదములలోఁ జేర్చనుండిరి. అట్లు కనుపించదు. వీరి బిరుదపద్ధతియే విలక్షణము. వీరి మహావాక్యోపదేశపద్ధతియు నితరపీఠవిలక్షణము. వీని నన్నిటిని నిష్పక్షపాత దృష్టితో విమర్శించినచో శృంగగిర్యాదులతో సమగౌరవము కలదై తమదేశమం దొక శాంకరపీఠ ముండుట కేమహనీయులో మధ్యకాలమున నొక సంప్రదాయము ప్రవర్తింపఁజేసిరనియు నాపురుషుని గౌరవమునుబట్టి యాపీఠము సకలగౌరవభాజనమై విలసిల్లుచున్నదనియుఁ గనుపట్టుచున్నది. "ఏతావతా ప్రబంధేన కామకోటి కుంభకోణ మఠాధిపై స్స్వవిషయే ప్రమాణత్వేన నిర్దిష్టాః శివరహస్యానందగిరికృత శంకరవిజయాదిగ్రంథాః తేషా మననుకూలా ఏవ ప్రత్యుతాస్మాక మనుకూలా భవంతీ త్యతి స్సిద్ధం కాంచీకామకోటికుంభఘోణమఠ శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యై ర్న స్థాపిత ఇతి - అని వ్యవస్థఁజేసిన యేకసత్పండిత హస్తాక్షరయుత పత్రికయే ప్రామాణికమని యెంచఁదగి యున్నది. మఱికల్యాణానందభారతిగారు సకల పీఠాధ్యక్షులను నోటికి వచ్చినట్లు విచ్చలవిడిగా దూషించుచు 'నేనే సకలపీఠములకుఁ బరమాచార్యుఁడను. (నమ్మంథాచారి నహిప్రతిల్ల)' అని వాదించుచుందురు. కల్యాణానందభారతిగారి గురువులగు బోధానందభారతిగారు విదండులైనందునను పూర్వయతులవల్ల నుపదేశము పొందినవారు కానందునను వారికే ధర్మపీఠాధికారము లేదని సకలదేశస్థులగు మహాపండితులును పీఠాధ్యక్షులును దీర్మానించియుండిరి. ఈసంగతులన్నియు జగద్విదితములైనను నుచ్ఛృంఖలముగా వాదించుట వారికే చెల్లును. ఇట్టిస్థితిలో వారివలెఁగాకున్నను సకలసద్గుణనిధులగు నీకామకోటి పీఠాధ్యక్షులు తమపీఠము సాక్షాచ్ఛ్రీశంకరాచార్యదీక్షితమనియుఁ దక్కినవి శిష్య పీఠములనియు బహుతరగ్రంథవిరుద్ధముగను సకలదేశస్థపండిత సమ్మతివిరుద్ధముగను బ్రచారముఁజేయఁబూనుట తత్త్వజిజ్ఞాసువులకు వ్యామోహకమగును. కనుక నీయుద్యమమునుండి వీరు విరమించుట యుక్తమని తోఁచెడిని. ఏది యెటులున్నను శ్రీచన్ద్రశేఖరేంద్రసరస్వతీస్వాములవారు స్వీయప్రవర్తనముఁబట్టి లోకపూజ్యు లనియు వారిని సత్కరించుట సకలశ్రేయోదాయకమనియు మాకు నమ్మకము.

ఇల్లాలు

రెండవ భాగము

—* స్త్రీ విద్య *—

కృష్ణాబాయి:—

తే. గీ. విద్యచేఁ దెల్వితేటలు వృద్ధినొందు.
తెలివిచే మంచిచెడ్డలు తెలియఁబడును.
మంచిపను లెంచియే పొనరించువాని
కిల నభీష్టము కరతలామలక మగును.

మానవకోటి జీవించుటకును నభివృద్ధినొందుటకును మార్గముల నెఱిఁగించు సర్వబోధలును విద్యయనఁబడును. జన్మప్రభృతి ప్రతివ్యక్తికి నట్టి బోధల నెఱుంగు నాసక్తి మెండుగా నుండుంగాని యట్టివ్యక్తి సంచరించు నావరణమునం దవకాశ మొప్పునంతవఱకు మాత్రమే యెఱుఁగఁగలదు. సాధారణముగ నెల్లవారును దమతమ యింద్రియవ్యాపారానుభవసిద్ధములగు విషయముల మాత్రము తెలిసికొనఁగలరు. వారి జీవితకాల మల్పమగుటచే నెవ్వరేని దేనింగూర్చియు ననుభవపూర్వకముగ సమగ్రముగఁ దెలిసికొనుట సంభవముకాదు. కావున ననుభవముగలవారలు గ్రంథములం జేర్చియున్న దేశాంతర కాలాంతర సిద్ధాంతముల నెఱింగినంగాని యేయొక విషయమును జక్కగఁ దెలిసియుండుటకు వీలు కలుగనేరదు ఇట్టివిషయము లెఱుంగుటకుఁ జదు వ్వాధారము. చదువు నేర్చి యట్టి గ్రంథస్థవిషయములఁ దెలిసికొని వానిని దమ యనుభవములోనికిఁ దెచ్చి లోకమున కెఱుకఁజేయఁగల వారలె విద్వాంసులు.

తే. గీ. చదువుచేతనె ప్రాక్తన జనుల కథలు
చదువుచేతనె దేశదేశముల విధులు
చదువుచేతనె యేవియుం జక్కగాను
తెలియు. దెలియకయుండినఁ దిప్ప లొదవు.

యుగాంతరములు గడచిన యీలోకముయొక్క పూర్వచరిత్రములను మానవసామాన్యమున కనుభవమునకు రాఁజాలనంత విరివిగల యీమహాప్రపంచమునందలి దేశీయవిషయములను వివిధకార్యసిద్ధియుఁ జదువుచేతనే మనము గ్రహించఁగలము. అట్లు తెలిసికొనక యెటులో యొనరింపఁబూనినఁ గార్యసిద్ధుల నొందఁజాలక మన మనేకకష్టముల పాలగుచుందుము.

జగదంబ:— చదువురానివా రందఱు సుఖము తెలియక త్రిప్పలు పడువారేనా యయితే?

కృష్ణా:— చదివియున్నవారి సహాకారముచేఁ గొంతవఱకు నట్టివారి యాపత్తులు తొలఁగుచున్నను వారును జదివినవారలే యైనపుడు వారనుభవింపఁగలంత సుఖము నందుటలేదని నిశ్చయముగఁ దెలియవచ్చును. తమకష్టసుఖములకుఁ గారణము లరసి తెలిసికొనఁజాలని యిట్టి సామాన్యజను లెల్లరును దా మనుభవించుచుండెడి కష్టముల నివృత్తిఁజేసికొనఁజాలక "నలువురితో పాటు నారాయణ" యనుకొనుచు సహించి యనుభవించుచుందురు.

తే. గీ. చదువుచేతను బుద్ధికిఁ బదను కుదిరి
మంచిచెడ్డల నవలీలఁ గాంచు తెలివి
యలవడెడి. దాన సర్వసౌఖ్యములుఁ గల్గు
గాన నెల్లరుఁ జదువంగఁబూనవలయు.

శిశువులు తమ కెప్పు డేమియవసరమో తెలిసికొనఁజాలక తమ తలిదండ్రులచే నమర్పఁబడిన వాని ననుభవించుచు సుఖించెదరు. అటులనే మనమును మనకుఁ గావలసిన విషయముల నెల్ల స్వానుభవమాత్రమున నెఱుఁగఁజాలము. ఉదారపురుషులు లోకోపకారచింత కలవారై తమ యనుభవసిద్ధములగు బహువిషయములం బొందుపఱిచి పిత్ర్యములగు నమూల్యరత్నము లట్లు వానినెల్ల వివిధగ్రంధపేటికల నింపియున్నారు. చదువు మన కబ్బినంగాని యాయమూల్యరత్నములు మన యనుభవమునకు రాఁజాలవు. కావున నవశ్యము చదువు నేర్చి యట్టిమహనీయులు మనకొఱకు సంగ్రహించిన పరమార్థముల సార్థకపఱిచి సుఖించు టుచితము.

ఈశ్వరసృష్టి యెల్లమహిమాదర్శమై మహానందము నొసంగుచుండును. అందు జంతుజాలవిశేషము లాశ్చర్యజనకములు. వానిలో మానవజన్మ ముత్కృష్టమైనదని తలంపఁబడుచున్నది. వీరికిఁగల వాగ్రచనాశక్తియే దీనికి ముఖ్యకారణము. వాగ్రచనయనఁ దమ యభిప్రాయముల నొరుల కెఱిఁగింప నోట నుచ్చరించు భాషారూపకధ్వనులు. జంతుజాలము లన్నియు నట్టి ధ్వనులచే న్యూనాధిక్యముగఁ దమతమ యభిప్రాయములం దెల్పఁగలవు.

కావునఁ గేవలము భాషాశక్తికారణమే మానవజన్మ మధికమని నిర్ణయించుటకుఁ జాలదు. తాత్కాలికముగ నుద్భవించు తమతమ మనోగతములం దెల్పుటయుమాత్రమే కాక స్థిరముగ నవి నిల్చియుండునట్లు గ్రంథస్థముల నొనర్చి బాహ్యప్రపంచముతో నిలిపి యుంచఁగలిగినందుననే మానవుఁ డధికుఁడగుచున్నాఁడు. ఇట్లు సమకూర్చియుంచఁబడిన విషయము తెలుఁగుటే చదువు. ఇది లేనినాఁడు మానవులును సామాన్యజంతువుల తరగతులలోఁ జేరవలసినవారే. ఇప్పటికిని ఎప్పటికిని జదువురానివారు తత్తుల్యులే యగుదురు. కావుననే యొకానొక కవిచంద్రుఁడు "విద్యలేనివాఁడు వింత పశువ"నియును, మఱియొకరు "ద్విపాదపశువ"నియు వక్కాణించియున్నారు. పశువు తాను సంచరించు ప్రదేశములమాత్ర మెఱిఁగి వర్తించును. అటులనే స్వవృత్తివిషయకగ్రంథవ్యాసంగము లేనివారు పశుజ్ఞానమునకంటె నధికము తెలియఁజాలరు. ఇట్టివారినే మన పూర్వులు "కూపస్థమండూకములు"ని నుడివియున్నారు. కావునఁ జదువురానివారికిఁ బశుతుల్యతామూర్ఖత లలవడియుండుట నిశ్చయము. అందుచేత నెల్లరు నవశ్యము చదువుకొని యంత్రసాధనములచే నింద్రియగోచరములుగాని రహస్యముల నెఱుఁగునట్టు విద్యానయనప్రాప్తిచే జ్ఞానాభివృద్ధి గాంచి మానవజన్మమును సార్థకపఱుపవలెను. స్త్రీపురుషు లిరువురును జేరినం గాని మానవులు కాఁజాలరు. ఈయుభయజాతులకు నట్టిచదు వలవడినఁగాని మానవత్వసిద్ధి కలుఁగదు. కాన మగవారికట్లాడువారికిని జదువు వచ్చియుండుట పరమావశ్యకము. భారతమున

తే. గీ. "విద్య యొసఁగును వినయంబు వినయమునను
పడయుఁ బాత్రత పాత్రతవలన ధనము
ధనమువలనను ధర్మంబు దానివలన
ఐహికాముష్మికసుఖంబు లందు నరుఁడు!"

అని చెప్పఁబడియున్నది. ధర్మార్థకామమోక్షములను పురుషార్థచతుష్టయము సిద్ధికి విద్యయే మూలాధారమని మన ఋషిపుంగవులు వచించియున్నారు. జన్మప్రభృతి మరణమువఱకును బురుషుల కేయే పదార్థములు నియమములు నాచారములు నవసరములో స్త్రీలకు నవియే యవసరములు. ఇది మనము ప్రతిదినము గాంచుచున్న సంగతి. కావున నిర్వివాదాంశమే. కనుకఁ బురుషులతోపాటు స్త్రీలకును జదువు వచ్చియుండనిచో వారికిహపరములు వలసినట్లు సిద్ధింపవని వేఱుగఁ జెప్ప నవసరములేదు.

జగ:-ఇప్పు డంతటఁ బరిపాటి యయిపోయినది. కాని నాచిన్నతనమునాఁటి కాడ పిల్లలు చదువుకొనఁగూడదని హోరాహోరిగాఁ బోట్లాటలు జరుగుచుండెడివి. ఏయూరిలోఁ జూచిన నీసభలే. అట్లు సభలు చేసిచేసి మొట్టమొదట

గుంటూరులో నగ్రహారములో శివాలయమువద్ద నిప్పటికి ముప్పదియేండ్లనాఁడొక యాడపిల్లలబడి పెట్టినారు. అప్పుడు మా మేనమామగారచట నుద్యోగములో నుండ నే నక్కడి కేగియుంటిని. ఈబడి ధనికులగు గొప్పవారు పెట్టించలేదు. బడిలోఁ జదువుకొను పిల్ల లందఱుఁ జేరి పెట్టించినారు. భువనగిరి మంగయ్యశాస్త్రిలుగారని గొప్ప పండితులు. ఆయన యెప్పుడును విద్యార్థులకు సంస్కృతము పాఠముచెప్పెడివారు. కొందఱి కన్నముకూడఁ బెట్టెడివారు. ఆయన మూడవకొమారుఁడు సీతారామసోమయాజులని యింగ్లీషు చదువుకొనుచు వారివారినే యొకరిని బంతులనుగా నేర్పఱిచినారు. చందాలువేసి యాయన కప్పుడు నెల కైదురూపాయలు జీత మేర్పఱచినారు. అప్పటి జిల్లాజడ్జిగారీబడికొఱకు నెలకుఁ బదిరూపాయలు చందా యిచ్చినారని చెప్పుకొన్నారు. ఈబడి కొన్నాళ్ళు జరిగిన తరువాతఁ గ్రైస్తవ మతమువారు పూనుకొని యూరిలోఁ జాలబళ్ళు పెట్టించినారు. ఏక్రొత్త మార్పు వచ్చినను నౌననెడివారు సగముమంది కాదనెడివారు సగముమంది. ఎట్లయితే నేమి యిప్పటి కాడపిల్లలకుఁ జదువుచెప్పరాదను వివాదాలు నశించినవి.

కృ॥ అప్పటివా రాడపిల్లలు చదువుకొనిన నేమి నష్టియనెడివా రేమి?

జగ॥ మగనికిఁ జదువురాకుంటే ధిక్కరించెదరనియుఁ దమయిష్టము వచ్చినవారి కెల్ల నుత్తరాలు వ్రాసెదరనియు నింటిలోఁ బనియే చేయరనియు నాడవాండ్రు చదువుకొని యుద్యోగాలుచేసెదరా యనియు మగవాఁ డింటిలోఁ బనిచేసికొనుచుంటే నాడది సంపాదించిపెట్టురోజులు వచ్చిన వనియుఁ గలియుగమహిమయనియు— నొకటా? ఇంటింట నిదే తగవు.

కృ॥ స్త్రీవిద్యంగూర్చి యుపన్యాసమంజరిలోని సంగతులు కొన్ని చెప్పెదను వినుఁడు. పురుషుల విద్య వారికిమాత్రమే ఫలకారియై తత్కుటుంబమువారి కంతగ నుపయోగకారి కాఁజాలదు. పురుషుల కృషియు సామర్థ్యమును దమ కుటుంబపోషణార్థము మాత్రమే యుపయోగింపఁబడును గాని స్త్రీలయొక్క కృషిసామర్థ్యము లటులఁగాక వారి యనంతరమువారినిగూడ నభివృద్ధికలుపఁ గలిగియుండును.

తే. గీ. విద్యనేర్చిన పురుషుండు విత్త మిడెడు
పనుల నెఱవేర్ప నింటివెల్పలను దిరిగి
విశ్రమింపఁగమాత్ర మి ల్లాశ్రయించు
కాని తనవిద్య నరుఁ డొల్లఁ గఱపలేఁడు.

తే. గీ. ధనము నొనగూర్చుచుండెడిపనులఁ దిరిగి
రాత్రులం దలయిక తీఱుమాత్రమునకు

వ. వృత్తాంతంబు విన్నవించినంతనె మదీయ స్వాంతంబు గలంగి కొంతవడికి ధైర్యం బవలంబించి మలమూత్ర నిరోధంబున కిదియె కతంబని చింతించి యాపుట్టం గల గుట్టెల్ల నరయం గోరి యిట్టుల సమూలంబుగం గొట్టించి మహనీయ యోగ నిష్ఠాగరిష్ఠులరు నేకాగ్రచిత్తులరు విమలతపోధనులరు నగు మిమ్ముల మదీయానేక జన్మాంతరకృతానూనపుణ్యఫలంబునం గాంచి కృతార్థుండనైతి నో మహాత్మ ! మదీయజన్మంబు నేఁటికిం గదా ఫలంబునొందె ! మద్వంశంబును బరమపవిత్రం బయ్యెం గావున మునీంద్రా ! బాలయు ముగ్ధయు నగు నీకుమారి యొనర్చిన మహాపరాధంబు లెన్నియేనిం గల. వన్నియు క్షమియింపుండని నిటలతట ఘటితాంజలిపుటుండగుచు సాష్టాంగప్రణామంబు చేయుటయు నమ్మునిశార్దూలుండు.

చం. ఘనతరతీవ్రకోపమునఁ గన్నుల నిప్పులు రాలఁ జూచి యో
చెనఁటి! నృపాధమా! ఇటులఁ జేయుట భావ్యమె మమ్ముబోంట్ల నె
మ్మనమునఁ గొంకులేక యసమానవిభూతిమదాన నీవు ? మ
త్సునిశిత శాపశూలహతి సుక్కుదుగాకని పల్కి వెండియుఁన్.

క. వనమున ఫలమూలంబులు
తిని మౌనంబును వహించి దీనుల మగుచున్
వనజాక్షు పాదపద్మము
లనయము సేవించు మమ్ము నవమానింపన్. 96

చం. తగునెయటంచు మించి మఱి తాపసపుంగవుఁ డంతకంతకున్
మగఁటిమితోడఁ బావకునిమాడ్కి ధగద్ధగ మండ నమ్మునీం
ద్రుఁ గని మహీవిభుండు సుతఁ దోడ్కొని చయ్యన మానసంబునన్
నెగులుజనింప నేగి కడునేర్పుమెయిం దగ మ్రొక్కి యిట్లనున్.

ఉ. ఓమునిచంద్ర! భూరిసుగుణోత్కర! సాంద్రచమూయుతంబుగా
నేము త్వదీయ పాదనళినీదళముల్ గన వచ్చినారమ మి
కోమలి నాదు పుత్రి. కడుఁ గూర్మివహించి వివాహమై తగన్
మామక బాధలెల్లఁ బరిమార్చి మముం గృపఁజూడు మిత్తఱిన్.

సీ. పరివిమలాచార స్వభావ యీచంద్రాస్య.
దారఁగాఁ గైకొమ్ము తాపసేంద్ర !
భవ్యసద్గుణగణ భాగినీజవరాలు.
పత్నిగాఁ జూడు మోపారికాంక్షి !

సతత మభ్యాగతార్చనఁజేయు నిత్తన్వి.
గృహిణిగం జూడు మోముపివరేణ్య !
పరమపవిత్రి యీపంకేజదళనేత్రి.
పూని జాయగఁ గొను మునిబిడ్రాజ !

కల్లగా దిది మౌనిపుంగవ ! మదీయ
కన్య యిటువంటిదగుట సుకన్యకాభి
ధానము వహించె. ఇంకేల ? తడయవలదు
పెండ్లియాడుము నీవింకఁ బ్రేమమీఱ. 99

మ. పరమాచారధురీణ ! వేగ విను నాపల్కుల్ చెవింజొన్పి. కి
న్నర గంధర్వ సురాసురాదివరులన్ వాకృవ్వఁగానేల ? ఆ
హరియున్ నీరజగర్భుఁడున్ హరుఁడు మోహాంబూనియీక్షింతు రీ
తరుణాంభోజదళాయతాక్షిని వడిం దా రెంతయుం గాంచినన్.

క. అతపముల వసియించి మ
హాతపముల బడలియుండి యస్మత్సుత దా
శీతలగతి నుపచారము
లాతతమతిఁ జేయు మిగుల హార్ద్రముతోడన్. 101

క. విను మునిలోకగ్రామణి !
మనవియొనర్చెదను నిప్పు. మామకపుత్రి
మణి సద్గుణంబు లివి యని
వనజజునకుఁ దరమె పొగడ వసుధాస్థలిలోన్ ? 102

వ. కావున నోమునీంద్రా ! ఇమ్మందయాన కరగ్రహణం బొనర్చి మా
కగ్రిందు లెల్ల మాన్పుమని వందనశతంబు లొనర్చు క్షితిపతిం గని మందహాసం
బాననాంబుజం బలంకరింప సత్తాపసపుంగవుం డిట్లనియె. 108

శా. ఓరాజన్యశిఖామణీ ! గుణమణీ ! ఓవాక్సుధాధోరణీ !
భూరికోధమదాదియుక్తమగుచుం బొల్పారుచున్నట్టి సం
సారంబున్ మది రోసి యివ్వనుల నిస్సంగత్వముం బొందు మా
కీరామామణి యేలయంచు మతి దా నిట్లంచుఁ బల్కెన్. రహిన్.

క. ధాత్రీతలనాయక ! నీ
పుత్రీమణి షడ్రసాన్నములు విడిచి వనీ
పత్రఫలాదులు దిన నీ
నేత్రము లెటు లోర్వఁగలవొ నిక్కముఁ జెపుమా. 105

క. వర రాజ్యభోగగరిమం బరఁగెడు నంతఃపురాళి వసియించెడి యీ
తరుణి తరుగుల్మములలోఁ జరియించుట యెట్టులయ్యె తెల్పొ రమణాఢ్యా!

క. పరువంబగు జవ్వనమును
మురిపెంబుఁ దనర్చు రూపమును జిగిమేల్ బం
గరుగిండ్ల నపహసించెడు
వరకుచయుగ మొప్పుచుండు వనితామణికిన్. 107

క. ఘనమగు నుపవాసంబుల
ననయముఁ గృశియించి వనుల ననిలోదకముల్
గొని తపములు గావించెడు
ననుబోటి జరాంగునకును న్యాయమె యీయన్ ? 108

క. కావున సుకుమారుండగు భూవరతనుభవున కిచ్చి పూఁబోఁడిని వే
నీవిపు డుద్వాహము నృప! కావింపుము శుభకరంబుగాఁగ ధరిత్రిన్.

క. క్షీరము దధిఁ గ్రోలెడు నిచారుతరాపాంగ నాకు జాయయగువిధిన్
కూరిమిఁ జేయుటఁ జూడఁగఘోరతరాంబుధిని గన్యఁగూల్చుటగాదే?

తే. గీ. ప్రాజ్యసామ్రాజ్యపూజ్యసంపదలు గలిగి
వర్తిలుచునుండు క్షత్రియవర్యు లేడ ?
నారచీరలు ధరియించి నవసి కంద
మూలఫలములు భక్షించు మునుల మీద ? 111

తే. గీ. మాకు మీకును భేదంబు మదిఁ దలంప
హస్తిమశకంబులకు నెట్లొ యట్లు గాన
కయ్యమునకును (మఱియును) వియ్యమునకు
సమత గావలె ననియెదు సామ్య మెపుడు. 112

క. వినియుండ లేదొకో యోజననాయక! చనుము నీవు సైన్యంబులతో.
ననుఁ బల్కరింప నిఁక మద్ఘనతర శాపానలంబు గాల్చును జూమీ.

వ. అని యిట్లు పల్కు నమ్మునిపురందరు నిష్ఠురాలాపంబులు విని నృపవరేణ్యుండు పునఃపునః ప్రణామంబులు గావించి బద్ధాంజలియై యో మహాత్మా! భవద్వచనంబులు కఠోరంబులై మదీయ శ్రోత్రపుటంబుల భేదించుచున్నయవి. మీ వంటి మహాత్మున కస్మత్సుత నిచ్చి పరిణయంబొనర్చి భవత్ప్రసాదంబునకు భాజనం బగుటకంటె మాకొండు భాగ్యంబు గలదే! మద్వంశంబు పావనంబయ్యె. ఇందుచే మజ్జన్మాంతరకృత దురితంబులెల్ల నిర్మూలంబులై మేము పుణ్యలోకనివాసంబు చేయుటకు దక్షులమైతిమి. మదర్థంబులెల్ల భవదధీనంబులై యున్నయవి. మీరలు నిగ్రహానుగ్రహసమర్థులరు గావున మత్పుత్రీలలామంబు పాణిగ్రహణం బొనర్చి మమ్మక్షీణకృపాకటాక్షవీక్షణంబునం జూచి రక్షింపుమని పెక్కువిధంబులం బ్రార్థింప నా ఋషిగ్రామణి యెట్టకేలకుం బ్రసన్నుండై తదుద్వాహంబునకు సమ్మతించియుండె. అట్టియెడ 114

క. అమ్ముని కృపచే వెంటనె
ముమ్మరమగు మలనిరోధము (న విచ్యుతులై)
నెమ్మది నడరును వీడిరి
కొమ్మలునుఁ సైన్యములును గుతలాధిపుఁడున్. 115

తే. గీ. అపుడు శర్యాతిరాజేంద్రుఁ డనుపమాన
నిజశతాంగంబుపై మౌని నిలిపికొనుచు
చుట్టుఁ బరివారములు గొల్వఁ బట్టణంబు
చేర నరిగెను సంతోషపూరితుఁడయి. 116

తే. గీ. ఇట్లు పురమున కరిగి యయ్యిందుముఖుల
అంతిపురమున కనిచి భూకాంతుఁ డపుడు
తాపసేంద్రుని నొక హర్మ్యతలమునందు
విడియ నియమించి కొందఱు పడఁతుకలను. 117

క. కనుగొని మీ రేతత్క్షణ
మునఁ జని శుభవర్తమానమును మత్కాంతా
మణికిం దగ నెఱిఁగింపుం
డని పనిచిన వేగ వార లతికుతుకమునన్. 118